Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 08.09.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 14 పేజీలు : 12, వెల : ₹ 5


కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు : • రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత • రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# ఓటమి నేర్పిన పాఠమేంటి?



> జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
> తటస్థులపై గురిపెట్టాలి
> పార్టీలో ప్రక్షాళన జరగాలి

**గెలిస్తే ప్రపంచానికి నువ్వు తెలుస్తావ్... ఒక్కసారి ఓడిపోయి చూడు ప్రపంచమేంటో నీకు తెలుస్తుంది. రాజకీయాలలో గెలుపును ఆస్వాదించే వాడు కాదు, ఓటమిని భరించేవాడు, ఆ ఓటమితో పాఠాలు నేర్చుకునే వాడు, ఆ ఓటమిని రేపటి విజయానికి మెట్లుగా మలచుకునేవాడే నిజమైన రాజకీయ యోధుడు, ప్రజా నాయకుడు.**

నంద్యాల అసెంబ్లీ, కాకినాడ కార్పొరేషన్‌లలో ఓడిపోగానే వైకాపా పనైపోయిందని, జగన్ ఇక పార్టీని క్లోజ్ చేసుకోవచ్చున్నట్లుగా తెలుగుదేశం వర్గాలు, తెలుగుదేశం అనుకూల మీడియా ప్రచారం హోరెత్తిస్తోంది. ఒక్క ఓటమితోనే ఒక పార్టీ భవిష్యత్‌కు తెరపడేటట్లయితే ఈరోజు దేశ రాజకీయ చిత్రపటంపై కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలతో సహా చాలా పార్టీలు కనిపించవు. 1977లో కాంగ్రెస్ మట్టి కరిచింది. ఏడాది కల్లా సునామీలా లేచి నిలబడింది. 1984లో బీజేపీకి వచ్చింది రెండే రెండు సీట్లు. ఈరోజు తిరుగులేని ఆధిక్యతతో అధికారంలో వుంది. 1989లో ఏపిలో తెలుగుదేశం తుక్కుతుక్కయింది. 1994కల్లా ప్రభంజనమై లేచింది. కాబట్టి రాజకీయాల్లో గెలుపు శాశ్వతం కాదు, ఓటమీ శాశ్వతం కాదు. నిరంతర పోరాటం మాత్రమే శాశ్వతం.

కాకపోతే నంద్యాల, కాకినాడ ఓటముల నుండి ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నేర్చుకోవాల్సిన పాఠాలు చాలానే వున్నాయి. ఈ రెండు చోట్ల గెలవడానికి చంద్రబాబు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఎంతగా అధికార దుర్వినియోగం చేసాడో, ఎన్ని విధాలుగా ప్రలోభాలకు గురి చేసాడో అన్నది వేరే విషయం. 2019 ఎన్నికల్లో కూడా వీటన్నింటిని ప్రయోగించగల శక్తి చంద్రబాబుకు వుంది. వాటిని ఎదుర్కొనే మార్గమే ఇప్పుడు జగన్‌కు కావాలి. 2012లో ఏపిలో 17 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో వైకాపా అభ్యర్థులు 15చోట్ల భారీ మెజార్టీలతో గెలుపొందారు. ఈ గెలుపే 2014లో జగన్ కొంప ముంచింది. ఈ గెలుపు ఆత్మవిశ్వాసాన్ని బదులు అతివిశ్వాసాన్ని పెంచింది. ఎన్నికలు జరగడమే తరువాయి, గెలవడమే మిగిలిందన్నంత ధీమాను పెంచింది. అందుకే వస్తామన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులను పార్టీలోకి తీసుకోలేదు. వీళ్లంతా తెలుగుదేశంలోకి వెళ్లి వైకాపాకు చేయాల్సిన నష్టం చేశారు. అదేవిధంగా జగన్ రాజకీయ అనుభవ రాహిత్యం వల్ల కొన్ని నిర్ణయాలు తీసుకోలేకపోవడం కూడా పార్టీ పరాభవానికి కారణమైంది.

2014 ఎన్నికల్లో ఓటమిగాని, నిన్నటి నంద్యాల, కాకినాడ పరాజయాలు కాని ఒక్క విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. రాష్ట్రంలో ఇంకా ఒక వర్గం ప్రజలకు జగన్ దగ్గర కాలేకపోతున్నాడని. ఇక్కడ ఒక వర్గం (మిగతా 11వ పేజీలో)

• 'దేశం'లో సందిగ్ధం

# ఈ పవనాలెటువైపు?



**చంద్రబాబు చేతిలో తురుపుముక్క పవన్. ఆయన వెనుకున్న ఆరు అడుగుల బుల్లెట్ పవన్... ఆయన అమ్ములపొదిలో వున్న రామబాణం పవన్... నిజమే... పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు వజ్రాయుధమే.**

2014 ఎన్నికల్లో చంద్రబాబు సీఎం కావడానికి వాడుకోబడ్డ ఆయుధాలలో పవన్ ఒకడు. ఆరోజు పవన్ స్థాపించిన జనసేనతో పొత్తు పెట్టుకుని ప్రయోజనం పొందాడు. ఇదే వజ్రాయుధాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంకో విధంగా వాడుకుని లబ్ది పొందాలని చంద్రబాబు భావిస్తూ వచ్చాడు. అదెలాగంటే కాపు సామాజిక వర్గం బలంగా వున్న నియోజకవర్గాల్లో పవన్ జనసేన పార్టీ అభ్యర్థులను నిలబెట్టి, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడం, ఆ ఓట్లు వైకాపాకు పోకుండా చూసి తిరిగి తెలుగు దేశాన్ని అధికారంలోకి తీసుకురావడం.

(మిగతా 11వ పేజీలో)

కలం పై..

# పేలిన తూటా



* గౌరీ లంకేష్ దారుణ హత్య
* దుండగుల కోసం పోలీసుల గాలింపు

(వివరాలు 11వ పేజీలో)



# ఈ బాబు... ఆ బాబుకు... ఏజెంటనే?

**కేం**ద్ర మంత్రివర్గ విస్తరణలో విశాఖపట్నం ఎంపి, ఏపి బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబుకు ఎందుకు స్థానం దక్కలేదు? ఒక మిత్రుడు వేసిన ఈ ప్రశ్నకు ఒక రాజకీయ విశ్లేషకుడు ఇచ్చిన సమాధానం... విస్తరణలో మిత్రపక్షాలను తీసుకోలేదు కదా? ప్రశ్న వేసిన మిత్రుడు ఆశ్చర్యపోయాడు. అదేంటి హరిబాబు బీజేపీ ఎంపీయే కదా! అని ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. దానికి ఆ రాజకీయ పండితుడు చెప్పిన వివరణ... కంభంపాటి హరిబాబు పేరుకు బీజేపీ ఎంపీయే! ఆయన గెలిచింది ఆ పార్టీ కమలం గుర్తు మీదే! కాకపోతే ఆ తర్వాత ఆ విషయాన్ని మరిచిపోయాడు. ఈ మూడేళ్ల నుండి వంటికి పసుపు పూసుకుని తిరుగుతున్నాడు. 2014లో టీడీపీతో బీజేపీ పొత్తు మాత్రమే పెట్టుకుంది. కాని, హరిబాబు మాత్రం బీజేపీని టీడీపీలో విలీనం చేసామన్నట్లుగా బాబు సేవలో లీనమైపోయాడు. ఏపిలో బీజేపీని గాలికొదిలేసి, తెలుగుదేశం సేవలో తరిస్తున్నాడు. చంద్రబాబు ఎన్ని ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నా, చెక్కభజన చేస్తూన్నాడే గాని ఇదేమని ప్రశ్నించడం లేదు. ఇలాంటి నాయకుడికి కేంద్రమంత్రి పదవి ఇచ్చినా అది తెలుగుదేశంకు కేంద్ర కేబినెట్‌లో మూడో మంత్రి పదవి అవుతుందేగాని, ఏపిలో బీజేపీకి ఒరిగేదేమీ వుండదు. అందుకే ఆయనకు మంత్రి పదవి ఇచ్చి వుండరు. ఇందులో ఆక్షేపించాల్సింది ఏమీ లేదు. ఈ రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదల కోసం (మిగతా 11వ పేజీలో)



కంచి పట్టు చీరలు
వీవర్స్ ధరలకే
కళానికేతన్®
షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్ 2316677

### విత్తనాలు, ఎరువుల పంపిణీలో

# నిబంధనలను సరళతరం చేయాలి

**- వైఎస్సార్సీపి రైతునాయకుడు కొరపాటి మురళీనాయుడు**



ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో పంపిణీ చేసే జీలుగలు, పిల్లిపెసర, జనుము తదితర పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో విధించిన నిబంధనలు పటిష్టమైనవే అయినా, సామాన్యరైతులు వాటిని అనుసరించడం కష్టతరంగా ఉందని, కనుక ఆ నిబంధనలను పరిశీలించి సరళతరం చేయాలని వైఎస్సార్సీపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కొరపాటి మురళీధరనాయుడు విజ్ఞప్తి చేస్తున్నారు. జింక్ సల్ఫేట్, జిప్సం, బోరాన్ వగైరాలను బయోమెట్రిక్ విధానంతో ఇస్తున్నారని, అయితే వీటికి పాస్‌బుక్, ఆధార్ లింక్ చేయడం వంటి నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని చెప్తున్నారని, ఈ నిబంధనలను గ్రామీణ ప్రాంతాల్లోని పేదరైతాంగం అవగాహన చేసుకోవడం కష్టతరంగా ఉందని, దీంతో వాటి పంపిణీలో బాగా జాప్యం జరుగుతోందని ఆయన అన్నారు. ఎరువులు ఉచితం అని అంటున్నా, ఎకరానికి 4వందల కేజీల ఎరువులు, జింక్‌సల్ఫేట్ 20 కేజీలు వీటిలో ఏదో ఒకటి మాత్రమే ఇస్తామంటున్నారని, వీటిలో రైతులు ఏది తీసుకున్నా మళ్ళీ మూడేళ్ళదాకా వారికి వాటిని ఇచ్చేది ఉండదని, గ్రామీణ రైతులకు ఈ నిబంధనలు కొంత ఇబ్బందిగా ఉంటున్నాయని ఆయన పేర్కొన్నారు. గతంలో పచ్చిరొట్ట ఎరువులు ఎంత కావాలన్నా సబ్సీడీతో వెంటనే ఇచ్చేవారని అంటూ, ఈ నిబంధనలతో వాటి పంపిణీ బాగా తగ్గిపోయినట్లే ఆయన తెలిపారు. ప్రభుత్వం ఈ నిబంధనలను మరోసారి పరిశీలించి ఆచరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా సరళతరం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కావేరి పుష్కరాలకు రిజర్వేషన్లు ప్రారంభం

కావేరి పుష్కరాలకు నెల్లూరు ఆర్టీసీ-1 డిపో ఈ నెల 11వ తేదీ నుంచి సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎంవి కృష్ణారావు తెలిపారు. ఇటీవల డిపో కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని శ్రీరంగంలో కావేరి పుష్కరాలు ఈ నెల 12 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయని, భక్తుల సౌకర్యార్థం తొలిసారిగా నెల్లూరు నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. ఈ నెల 11వ తేదీ రాత్రి నెల్లూరు నుంచి ప్రత్యేకబస్సు(సూపర్ లగ్జరీ) ప్రారంభమవుతుందని, 12వ తేదీ ఉదయం శ్రీరంగం చేరుతుందన్నారు. పుష్కర పూజలు పూర్తయిన వెంటనే అదేరోజు సాయంత్రం శ్రీరంగం నుంచి ప్రారంభై కంచి, రేణిగుంట మీదుగా నెల్లూరు చేరుకుంటుందన్నారు. ప్రయాణఛార్జీ రూ.1400 చెల్లించి రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. అద్దె ప్రాతిపదికన సైతం బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. గరుడ ఏసి బస్సుకు కిలోమీటరుకు రూ.93, సూపర్‌లగ్జరీ బస్సుకు రూ.49, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలక్స్ బస్సుకు రూ.52 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి డిపో పరిధిలో బస్సు అందుబాటులో ఉందని భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పలు మండలాల్లో జోరుగా వాన

జిల్లాలోని పలు మండలాల్లో ఆది, సోమవారాల్లో వర్షాలు కురిశాయి. పగలంతా మిడిమేళంగా ఎండ కాస్తున్నా, సాయంత్రమయ్యేసరికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై జోరు వాన కురిసింది. ఈ రెండు రోజుల్లో నెల్లూరులో అత్యధికంగా 58.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా బాలాయపల్లి మండలంలో 55.4, వెంకటాచలంలో 48.4, ఉదయగిరిలో 43.6, సైదాపురంలో 42.4, గూడూరులో 34.6, ఆత్మకూరులో 28.6, జలదంకిలో 26.4, కొండాపురంలో 26.2, పొదలకూరులో 26.0, మనుబోలులో 22.6, అనుమసముద్రంపేటలో 22.0, ముత్తుకూరులో 20.4, కొడవలూరులో 19.4, మర్రిపాడులో 18.8, బోగోలులో 15.2, దక్కిలిలో 14.2, సంగంలో 12.2, దగదర్తిలో 10.2 మిల్లీమీటర్ల వంతున వర్షపాతం నమోదైంది. ఇతర మండలాల్లో మాత్రం వాన జాడ లేదు.

## నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి యు.చంద్రప్రకాశం, నాగమల్లీశ్వరి దంపతులు ఈ నెల 3వ తేదీన రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఛైర్మెన్ వెంకటేశ్వర్లురెడ్డి, ఇ.ఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న అన్నదాన పథకం బాగుండడంతో ఈ విరాళాన్ని అందజేశామని పేర్కొన్నారు. పాలకమండలి సభ్యులు పులుగు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## స్టార్స్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్‌గా కె. రాజేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్ స్టార్స్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్‌గా కె.రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఆ మేరకు ఆయన సోమవారం నెల్లూరుకు విచ్చేసి బాధ్యతలు స్వీకరించారు. విశాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఆయన ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆ అధికారికి జైలు అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### ఆ పైపులతో...

# ఆయకట్టుకు నీళ్ళు కట్



**చేసే అభివృద్ధి పనులు ప్రజలకు మంచి చేసేలా వుండాలేగాని ఇంకొంచెం ఇబ్బందిగా మారకూడదు. ఒకరి సమస్య తీర్చడానికి చేస్తున్న పని ఇంకో పది మందికి సమస్య కాకూడదు.**

కాని, నెల్లూరు రూరల్ పరిధిలోని 31వ డివిజన్ శ్రామికనగర్ వద్ద కనుపూరు కాలువపై జరుగుతున్న పనులను చూస్తే రైతులకు కొత్త సమస్యలు తీసుకొస్తున్నారనిపిస్తోంది. సంగం ఆనకట్ట వద్ద నుండి మొదలయ్యే కనుపూరు కాలువ నెల్లూరురూరల్ పరిధిలోని 31వ డివిజన్ శ్రామికనగర్ నుండీ వెళుతుంది. శ్రామికనగర్‌లో కాలువకు అటు ఇటు నివాసాలున్నాయి. ఇటీవల పదేసి లక్షల వ్యయంతో కాలువపై అటు ఇటు పోవడానికి వీలుగా రెండు వంతెనలు నిర్మించారు. వీటివల్ల కాలువలో నీటి ప్రవాహానికి ఇబ్బందేమీ లేదు. ఇటీవల శ్రామికనగర్‌లోనే ఓపెన్ ఎయిర్ జైలుకు వెళ్ళే మార్గంలో కాలువకు పైపులైన్‌లు వేసి దారి ఏర్పాటు చేస్తున్నారు. పైపు లైన్‌ల వల్ల నీళ్ళు బ్లాకయ్యే పరిస్థితి వుంది. నెల్లూరురూరల్ పరిధిలోని అంబాపురంలోని మూడు చెరువులకు అక్కపాడు చెరువుకు కనుపూరు కాలువ ద్వారానే నీళ్లందుతాయి. ఈ నాలుగు చెరువుల క్రింద 600 ఎకరాల ఆయకట్టు వుంది. ఈ పైప్‌లైన్ల వద్ద నీళ్లు బ్లాక్ అయితే చెరువులకు నీళ్లు రాక ఆయకట్టు రైతులు ఇబ్బందిపడే పరిస్థితి వుంది.

కాబట్టి పైప్‌లైన్ల బదులుగా కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

# కన్నులపండువగా రథోత్సవం

- భక్తజన సంద్రంగా మల్లాం
- వేడుకగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



చిట్టమూరు మండలం మల్లాంలో ఉన్న ప్రసిద్ధమైన వళ్ళీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వేడుకగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి-అమ్మవార్లను ఈ సందర్భంగా స్వామివార్లను శోభాయమానంగా అలంకరించి, రథంలో వేంచేపు చేసి మల్లాం గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకల మధ్య రథోత్సవం ఎంతో కనువిందుగా సాగింది. ఎంతోమంది యువతీ యువకులు రథాన్ని లాగి స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అశ్వవాహనోత్సవం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి-కాంచనమాలమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి గణపం రమణారెడ్డి, వాకాడు సిఐ ఉప్పాల సత్య నారాయణ, ఎస్ఐ వేణుగోపాల్, ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ పాపారెడ్డి వెంకటసుబ్బారెడ్డి, గ్రామపెద్దలు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగానే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేస్తుండడంతో మల్లాం గ్రామం భక్తజనసంద్రంగా మారింది. ఎక్కడ చూసినా భక్తుల రద్దీతో మల్లాం వీధులు కిటకిటలాడాయి.

# హిందూధర్మ రక్షకుడు పివిఆర్కే ప్రసాద్

హిందూ ధర్మ పరిరక్షణ కోసం తన జీవితాన్ని అర్పించిన పివిఆర్కే ప్రసాద్ కారణజన్ముడని, హిందూ దేవాలయ ప్రతిష్ఠాపన పీఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ పేర్కొన్నారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కన గల డిఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి సమరసత ఫౌండేషన్, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన టిటిడి మాజీ ఇ.ఓ పివిఆర్కే ప్రసాద్ సంస్మరణ సభలో స్వామీజీ మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణకు ఆయన చేపట్టిన కార్యక్రమాలు, టిటిడి ప్రగతికి ఆయన నిర్వహించిన సేవలు అనన్య సామాన్యమన్నారు. తిరుమల చరిత్రలో పివిఆర్కే ప్రసాద్ రాజులతో సమానంగా నిలిచిపోతారన్నారు. హిందూధర్మ పరిరక్షణకు ఆయన చేసిన సేవలను గుర్తించి తిరుపతిలో పివిఆర్కే కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాన్ని తాము పీఠాధిపతులు, స్వామీజీలు, వివిధ ఆశ్రమాల నిర్వాహకులతో కలసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ పివిఆర్కే ప్రసాద్ చూపిన బాటలో తామంతా నడుస్తామన్నారు. తనవంతుగా కమలానంద భారతి స్వామీజీ చేపడుతున్న దేవాలయాల సందర్శన యాత్రకు రూ.50వేలను చెక్కు రూపంలో అందజేస్తున్నానన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో వివిధ ఆశ్రమాలు, పీఠాలకు చెందిన అధిపతులు మార్కండేయస్వామీజీ, శ్రీహరి తీర్థానంద స్వామీజీ, దయానంద స్వామీజీ, రామాయణం మహేష్ స్వామీజీ, దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, వివిధ ఆలయాల ఈ.ఓలు పులి కోదండరామిరెడ్డి, గోపి, సమరసత ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, సి.వి.సుబ్రహ్మణ్యం, జిల్లాలోని వివిధ హిందూ ధార్మిక సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య పరీక్షలు

నెల్లూరు హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 3వ తేదీ ఆదివారం జనవిజ్ఞాన వేదిక, విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. దాదాపు 800మంది రోగులను పరీక్షించారు. విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ ఎం.వి.చలపతి మాట్లాడుతూ మూర్ఛ, షుగర్, బిపి, పక్షవాతం వంటి జబ్బులకు ఉచితంగా పరీక్షించి రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200లకే అందిస్తున్నామన్నారు. నవంబర్ 5వతేదీ మరో శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. డాక్టర్లు జి.రమేష్ బాబు, ఎంవి.రమణయ్య, రాజేశ్వరరావు, శ్రీను నాయక్, ఖాదర్‌వలి, ఈదూరు సుధాకర్, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### వై.యస్. కుటుంబంలో

# సభ్యులమవుదాం

### -ఎమ్మెల్యే అనిల్‌కుమార్



ప్రతిఒక్కరం వై.యస్.కుటుంబంలో సభ్యులమవుదామని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఈ నెల 6వ తేదీన నెల్లూరు, విజయమహల్ గేటు వద్దగల ఎంసియస్ కళ్యాణ మండపంలో 'వైయస్సార్ కుటుంబం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ అండగా నిలిచేందుకే జగన్మోహన్‌రెడ్డి వైయస్సార్ కుటుంబం కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. వై.యస్. కుటుంబాన్ని అభిమానించే వారందరినీ కలుపుకుని పోవాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికి తమ కార్పొరేటర్ లేదా డివిజన్ ఇన్‌ఛార్జ్ వస్తారని, జగనన్న ఆశయాలను వివరించి వై.యస్.కుటుంబంలో వారిని చేర్చుకుంటారని తెలిపారు. వైయస్సార్ కుటుంబంతో పార్టీ బూత్ స్థాయిలో బలోపేతం కావడంతో పాటు పార్టీ కార్యక్రమాలు ప్రజలకు చేరువవుతాయని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రిలో ఎంసిఐ తనిఖీలు



మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసిఐ) బృందం 6వ తేదీ నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో తనిఖీలు చేపట్టింది. వైద్య కళాశాలలో మెడిసిన్ ఫైన లియర్ అనుమతుల కోసం ఈ పరిశీలన జరిపారు. వైద్య మండలి సభ్యులు ప్రొఫెసర్ మానిక్ ఛటర్జీ, ప్రొఫెసర్ రాకేష్‌శర్మ, డాక్టర్ సుందర్‌లు ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌లు, రోగుల వార్డులు, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి పాత భవనాలను, కొత్త భవనాలను చూసారు. ప్రభుత్వ వైద్య కళాశాలలోని ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్టిఫికెట్లను వీరు తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో వారి వెంట వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధాకృష్ణరాజు, ఆర్ఎంఓ డాక్టర్ వరప్రసాద్‌లు కూడా పాల్గొన్నారు.

### విశ్వసాయిలో...

# గురుపూజా మహోత్సవం



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఈ నెల 5న గురుపూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వసాయి సంస్థల డైరెక్టర్లు డా.ఎన్.సత్యనారాయణ, జి.కృష్ణమోహన్ పాల్గొని మాట్లాడుతూ, ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత గురువులదేనన్నారు. గురువు అంటే అంధకారాన్ని తొలగించి జ్ఞాన ప్రకాశాన్ని కలిగించేవారని అర్థమన్నారు. గురువులు పట్టుదల, సహనం పెంపొందించుకుని పాఠ్యాంశాలను విద్యార్థులకు బాగా అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఆదర్శ ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించి దేశంలో మహోన్నతమైన రాష్ట్రపతి పదవిని అధిష్టించిన మహనీయుడు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థుల భవితను తీర్చిదిద్దేది గురువులేనని అంటూ వారికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల జి.ఎం రాజేష్‌కుమార్, డిజిఎం నరేష్‌తో పాటు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# శతవసంతోత్సవ వేడుకకు ముస్తాబైన వేదిక

### ఐదుగురు మంత్రుల రాక



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు శత వసంతోత్సవాల వేడుకకు బ్యాంకు ప్రాంగణం ముస్తాబైంది. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల కోసం బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలలో బ్యాంకు సభ్యులకు, రైతులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనివార్య కారణాలతో ఈ వేడుకలకు రాలేకపోతున్నప్పటికీ ఐదుగురు రాష్ట్ర మంత్రులు సి.ఆదినారాయణరెడ్డి, ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావులు ఈ వేడుకలకు హాజరవుతున్నారు. జిల్లాలోని అందరు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా సంస్థల ఛైర్మెన్‌లను కూడా ఈ వేడుకలకు ఆహ్వానించారు. వందేళ్ల సహకార బ్యాంకు ప్రయాణంలో బ్యాంకు పురోభివృద్ధికి పాటుపడ్డ బ్యాంకు మాజీఛైర్మెన్‌లు, బ్యాంకు విశ్రాంత అధికారులను కూడా ఈ వేడుకల్లో సన్మానించనున్నారు.




# విశిష్ట సేవలకు లయన్స్ పురస్కారం

నెల్లూరు ముత్తుకూరు రోడ్డులో వున్న వైవి లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో సమాజంలో విశిష్ట సేవలందించిన జర్నలిస్టులు, ఉపాధ్యాయులకు ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోటోగ్రాఫర్ ముత్యాల వెంకటరమణ, ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీనివాసులు, రామలక్ష్మయ్యలను శాలువతో, పూలమాలలతో సత్కరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షుడు యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్, కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, ట్రెజరర్ రామాంజనేయులు, లయన్ బయ్యా శ్రీనివాసులు, లయన్ ఎస్.వి.రమణయ్య పాల్గొన్నారు.



# తిరిగొచ్చిన జేసీ

జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ 7వ తేదీ మక్కా యాత్ర పూర్తి చేసుకుని ఇండియాకు తిరిగొచ్చారు. గత నెల 13వ తేదీన ఆయన హజ్ యాత్రకు వెళ్లారు. అప్పటినుండి జేసీ-2గా వున్న వెంకట సుబ్బారెడ్డి ఇన్‌ఛార్జ్ జాయింట్‌కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

# జడ్పీ స్థాయి సంఘ సమావేశం

నెల్లూరుజిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 12వ తేదీ ఉదయం 10గంటలకు ప్రారంభమవుతాయని జడ్పీ సిఇఓ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. 10గంటలకు గ్రామీణాభివృద్ధి మీద, 10.45 గంటలకు వ్యవసాయం మీద, 11.30గంటలకు విద్యా, వైద్యం మీద, 12.15 గంటలకు స్త్రీ సంక్షేమం మీద, మధ్యాహ్నం 3గంటలకు సాంఘిక సంక్షేమం మీద, 3.45 గంటలకు ప్రణాళిక, ఆర్థిక విషయాల మీద స్థాయీసంఘ సమావేశాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.



### వివాదాల...

# అధికారిపై వేటు

జిల్లా విద్యాశాఖను వివాదాలమయం చేసి, అవినీతి ఆరోపణలను ఎప్పుడూ నెత్తిన పెట్టుకుని తిరిగే జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగంపై మరోసారి వేటు పడింది. ఆయనను విధుల నుంచి తప్పించి, ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు వెంటనే ఆయనను రిలీవ్ చేశారు. గుంటూరు ఆర్జేడీగా వున్న కె.వి.శ్రీనివాసులరెడ్డిని ఇన్‌ఛార్జ్ డిఇఓగా నియమించారు. ఈనెల 6వ తేదీన పాఠశాల విద్యాశాఖ ఇన్‌ఛార్జ్ కమిషనర్, సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు నెల్లూరుకు వచ్చి డిఇఓ ఆఫీసులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డిఇఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నం 1గంట నుంచి 7 గంటల వరకు తనిఖీలు జరిగాయి. ఆయన తనిఖీలలో కార్యాలయంలో మూవ్‌మెంట్ రిజిష్టర్‌ను సక్రమంగా నిర్వహించడం లేదనే విషయం అర్థమైపోయింది. డిఇఓ మువ్వా రామలింగం బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాడని ఆయన గుర్తించాడు. మూవ్‌మెంట్ రిజిష్టర్ వ్రాయమంటే నాలుగేళ్లలో కనీసం నాలుగు రోజులు మాత్రమే వ్రాసాడని, జిల్లాలో ఎన్నో ప్రైవేట్ పాఠశాల లకు ఫైర్, పోలీసు శాఖల ఎన్ఓసిలు లేకుండానే అనుమతులు ఇచ్చారని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిఇఓ మువ్వా రామలింగంను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆయన ప్రభుత్వానికి నివేదించారు. అలాగే కార్యాలయంలోని ముగ్గురు ఏడిలకు నోటీసులు జారీచేశారు. కమిషనర్ శ్రీనివాసులు పర్యటన జరిగిన పక్కరోజే 7వ తేదీ మధ్యాహ్నానికి మువ్వా రామలింగంను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి.

కుక్కతోక వంకర సామెతలాగా ఎన్నిసార్లు క్రమ శిక్షణ చర్యలు తీసుకున్నా మువ్వా రామలింగం వైఖరిలో మాత్రం మార్పు రావడంలేదు. గతంలో నెల్లూరు డిప్యూటీ డిఇఓగా పని చేసినప్పుడు ఆయన మీద గుట్టలుకొద్ది ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత కర్నూలు, ప్రకాశం, చిత్తూరుజిల్లాలో డిఇఓగా పనిచేసి ఆరోపణలతో బదిలీ అయ్యాడు. నెల్లూరుకు వచ్చాక కూడా పద్ధతి మార్చుకోలేదు. వచ్చినప్పటి నుండి వివాదాలతో విద్యాశాఖను భ్రష్టు పట్టించాడు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## 'ప్రభా'తం

# శాంతి వైపు అడుగులు



చైనాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఈసారి ఒకరకంగా భారత్‌కు విజయవేదికే అయింది. డోక్లామ్ వివాదం ఆందోళన రేకెత్తిస్తున్న నేపథ్యంలో జరిగిన ఈ సదస్సులో భారత్ దౌత్యం ఫలించడం, చైనా-భారత్ నేతలు డోక్లామ్ వివాదం సమసిపోవడానికి నిర్ణయాలు తీసుకోవడం శుభపరిణామం. ఉగ్రవాదంపై సమిష్టి పోరుతో పాటు, బ్రిక్స్ సదస్సులో తాజాగా చేసిన తీర్మానాలు శాంతి యుతమైన.. సరైన ప్రపంచం సాకారానికి శ్రీకారం చుట్టడం విశేషం.

ఇదెంతో శుభపరిణామం. గత కొన్ని రోజులుగా భారత్-చైనాల మధ్య వివాదాలను సృష్టించిన డోక్లామ్ సమస్యకు ఫుల్‌స్టాప్ పడింది. ఇరుదేశాలు ఆ మేరకు నిర్ణయించుకోవడంతో డోక్లామ్ సమస్య ఇక దూరమైనట్లే భావించవచ్చు. రెండు నెలల కిందట డోక్లామ్ వద్ద భారత్-చైనాల మధ్య తలెత్తిన వివాదం ఏ పరిణామాలకి దారితీస్తుందోనని అందరూ ఆందోళన చెందుతున్న నేపథ్యంలో జరిగిన బ్రిక్స్ సదస్సు ఈ రెండు దేశాలకి మరింత కీలకమైనదే అయినప్పటికీ, భారత్-చైనాల మైత్రికి ఎలాంటి ఇబ్బంది లేకుండా, మరింత సన్నిహితంగా ఉండేందుకు, ఇరుదేశాలు పరస్పరం గాఢమైన సుహృద్భావ సంబంధాలను కలిగేందుకు దారితీయడం చెప్పుకోదగ్గ విశేషం. అంతేకాదు, ఇరు దేశాధీశులు కరచాలనం చేసుకుని ఎంతో సంతోషంగా మాట్లాడుకోవడం, డోక్లామ్ వద్ద నుంచి ఇరుదేశాలు తమ సైనికదళాలను వెనక్కు తీసుకోవాలని నిర్ణయించుకోవడం శుభపరిణామం. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌తో సయోధ్యకు ముందుకు రావడంతో భారత్ దౌత్యం ఫలించినట్లయింది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో 'పంచశీల శాంతి సూత్రాలు, పరస్పర రాజకీయ విశ్వాసం, పరస్పర ప్రయోజన సహకారం, ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధి విషయంలో భారత్‌తో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉందని'.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటించడం విశేషం. అంతే కాదు, భారత్-చైనా దేశాలు ఒకరికొకరు ముప్పు కాదు, ఒకరి కొకరు ముఖ్యమైన పొరుగు దేశాలు. సరిహద్దుల్లో శాంతి నెలకొల్పేందుకు మనం కలసి పనిచేద్దాం'.. అని ప్రకటించడంతో డోక్లామ్ సమస్యకు తెరపడినట్లేనని భావించవచ్చు. ఇరుదేశాల అభివృద్ధికి తోడ్పాటు నందించేలా సంయుక్త ఆర్థిక, భద్రత, వ్యూహాత్మక బృందాల ఏర్పాటుపై కూడా ఇరుదేశాల నేతలు చర్చించుకోవడం ఒక మేలిమలుపుగా భావించవచ్చు. అదొక్కటే కాదు, ఈసారి బ్రిక్స్ సదస్సు మరెన్నో అద్భుతమైన కార్యాలకు శ్రీకారం చుట్టిందనే చెప్పాలి. శాంతికి-సహనానికి ప్రతీక అయిన భారత్.. ప్రపంచాన్ని శాంతివైపుకు నడిపించడంలో..శాంతికి బద్ధశత్రువైన ఉగ్రవాదాన్ని భూస్థాపితం చేసి సకల మానవాళికీ శాంతియుత సహజీవనాన్ని చేరువచేయాలని చేస్తున్న ప్రయత్నంలో..ఈ సదస్సు ద్వారా భారత్ ఒక అడుగు ముందుకు వేసిందనే అనవచ్చు. చైనాలోని జియామెన్‌లో జరిగిన బ్రిక్స్ (బ్రిటన్, రష్యా, చైనా, ఇండియా, సౌత్‌ఆఫ్రికా) దేశాల సదస్సు అందుకు వేదికైంది. బ్రిక్స్ దేశాలతో పాటు, ఆ దేశాలకు సన్నిహితంగా ఉన్న ఈజిప్ట్, తజికిస్తాన్, థాయ్‌ల్యాండ్, మెక్సికో, కెన్యా దేశాలను అతిథి దేశాలుగా ఆహ్వానించి ఎంతో సౌహార్ద్రపూరితమైన వాతావరణంలో జరిగిన అత్యున్నత బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో భారత్ తన ప్రాతినిధ్యాన్ని ఘనంగా చాటుకుని ప్రపంచదేశాలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ బ్రిక్స్ సమావేశంలో పాల్గొని చేసిన సందేశం ప్రపంచదేశాల మన్ననలు అందుకునేలా సాగింది. "మేం ఏది చేసినా ప్రపంచంపై దాని ప్రభావం చెప్పుకోదగ్గ రీతిలో ఉంటుంది. అందువల్ల, బ్రిక్స్ ద్వారా ప్రపంచాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ప్రపంచ రూపాంతరీకరణలో రాబోయే పదేళ్ళ కాలంలో బ్రిక్స్ దేశాల కూటమి కీలకపాత్ర పోషిస్తుంది. అదో స్వర్ణదశాబ్దిగా నిలిచిపోతుంది".. అంటూ ఎంతో ఆశావహంగా చేసిన ప్రధాని మోడీ ప్రకటనకు ప్రపంచవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ మానవాళిలో సగం ఈ కూటమి దేశాల్లోనే ఉందని, ఉగ్రవాదాన్ని నిర్మూలించడం, సైబర్ భద్రత కల్పించడం, విపత్తు యాజమాన్యాల ద్వారా సురక్షితమైన ప్రపంచాన్ని సృష్టించడం, వాతావరణ మార్పులపై నియంత్రణ సాధించడం, మన ప్రపంచాన్ని హరిత భూమిగా మార్చుకోవడం వంటి పది పవిత్రమైన ఆశయాలను సాకారం చేసుకునేందుకు బ్రిక్స్ కృషి చేస్తుందని ప్రధాని మోడీ తనదైన శైలిలో స్పష్టంగా వివరించడం ప్రపంచ దేశాలను బాగా ఆకట్టుకుంది. ఇదే సందర్భంలో, ఇన్ని దేశాలను బ్రిక్స్ సదస్సు కోసం ఇలా ఒక్కచోటికి చేర్చిన చైనా అధ్యక్షుడు షి-జిన్‌పింగ్‌ను కూడా ప్రధాని మోడీ అభినందించారు. ఈసారి బ్రిక్స్ సదస్సులో మనదేశానికి దౌత్యపరంగా ఘనవిజయం చేకూరడం ఎంతైనా విశేషం. ముఖ్యంగా, ఉగ్రవాద ఉదంతాలకు కారణమౌతున్న జైషే మహమ్మద్, లష్కరే తోయిబాతో సహా పలు పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలపై సదస్సు తీవ్రమైన ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడం, ఉగ్రవాద సంస్థలను పెంచిపోషిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని, ఉగ్రవాద సంస్థలపై సమిష్టిగా పోరాడాలని తీర్మానించడం ఈ సదస్సులో ఎంతో ముఖ్యమైనవి.. ఈ తీర్మానం కోసం మనదేశం ఎంతోకాలంగా పట్టుబడుతున్నా ఏదో ఒక సాకుతో దాన్ని పక్కనబెడుతూ వచ్చారు. ముఖ్యంగా చైనా ఈ విషయంలో అడ్డుచక్రం వేస్తూ వచ్చింది. అయితే, ఇన్నాళ్ళకి ఈ తీర్మానానికి మోక్షం కలిగింది. అంతేకాదు, చైనా కూడా ఈసారి భారత్‌తో స్వరం కలపడం మరో ముఖ్యవిశేషం. ఏదేమైనా, ప్రపంచాన్ని భయపెడుతున్న ఉగ్రవాదం విషయంలో ఇప్పుడు దాదాపు అన్ని దేశాలు కలదెలుసుకుంటున్నాయి. ఈ మార్పు భారత్ ద్వారానే, ప్రత్యేకించి ప్రధాని మోడీ నిరంతర కృషి ద్వారానే సాధ్యమవుతున్నదనే విషయం ప్రపంచానికంతటికీ తెలిసిందే. అందుకు ప్రధాని మోడీని అభినందించక తప్పదు. ఉగ్రవాదాన్ని సమూలంగా మట్టుబెట్టినప్పుడే ప్రపంచానికి శాంతి కాంతులు అందుతాయన్నది అందరికీ తెలిసిన విషయమే.

ఏదేమైనా ఈసారి బ్రిక్స్ సదస్సు చేసిన తీర్మానాలు ప్రపంచానికి మార్గదర్శకంగా ఉన్నాయి. అన్నిదేశాలు ఐక్యంగా ఉండి ఉగ్రవాదంపై పోరుసాగించడం, సమస్త మానవాళికీ శుభప్రదమైన.. శాంతియుతమైన సమాజాన్ని సాకారం చేయాలని ఆశిస్తూ తీర్మానాలు చేయడం.. తద్వారా సరైన ప్రపంచాన్ని నిర్మించుకునేందుకు బ్రిక్స్ శ్రీకారం చుట్టడం ఎంతైనా శుభపరిణామం. బ్రిక్స్ ద్వారా చేస్తున్న ఆ మంచి ప్రయత్నాలు సఫలీకృతం కావాలని ఆశిద్దాం, ప్రపంచం శాంతితో కళకళలాడేందుకు.. సరైన ప్రపంచ నిర్మాణానికి అన్ని దేశాలు చిత్తశుద్ధితో కలసికట్టుగా కృషిచేయాలని కోరుకుందాం!...

---

# నరకంగా మారిన నగరం

### - రోడ్లు నాశనం చేశారంటూ బిజెపి నేతల నిరసన



నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాట్ల పేరుతో అనేక రోడ్లను నాశనం చేశారని, గుంతలు తవ్వేసి వదిలేయడంతో ఆ గుంతల్లో మురుగు నీరు చేరి, దోమలు ప్రబలి ప్రజలు నానారకాల ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టరేట్ వద్ద సోమవారం బిజెపి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ, బాగున్న రోడ్లను నాశనం చేశారని, తవ్వి వదిలేసిన గుంతల వల్ల జనం ప్రమాదాల బారిన పడుతున్నా ఉన్నతాధికారులెవరూ పట్టించుకోవడం లేదని, దీంతో నగరం నరకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లను బాగుచేయకుంటే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన తప్పదన్నారు. అనంతరం నాయకులంతా వెళ్ళి రోడ్లు బాగుచేసేందుకు సత్వరచర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ ముత్యాలరాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ నిరసన ప్రదర్శనలో బిజెపి నాయకులు మిడతల రమేష్, మాజీ కౌన్సిలర్ కరణం భాస్కర్, మొగరాల సురేష్, శ్యాంబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

---

# 9న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి మాలధారణ

### - సేవాసమితి అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి



ఈనెల 9వ తేదీన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి మాలధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి మాలధారణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు అశేషభక్తుల పూజలు అందుకుంటున్నారని, ఆ అమ్మవారి కరుణతో భక్తులందరూ సుఖసంతోషాలతో జీవించాలని వేడుకుంటూ తొమ్మిదేళ్ళ క్రితం అమ్మవారి మాలధారణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. తొలిఏడాది 200 మంది భక్తులతో ప్రారంభమైన మాలధారణ గత ఏడాది 1500 మందితో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగిందన్నారు. భక్తుల కోరిక మేరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు తంగిరాల రాధా కృష్ణశర్మ మాట్లాడుతూ, ఈనెల 9వతేది ఉదయం 10.30 గంటలకు మాలధారణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మాలధారణ చేసే భక్తులకు అవసరమైన వస్త్రాలను సన్నపురెడ్డి పెంచలరెడ్డి సౌజన్యంతో అందజేస్తామన్నారు. భక్తులు 21 రోజులు మాలధారణ చేయడం జరుగుతుందని, వారికి ఆలయ ప్రాంగణంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నభోజనం ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, కొలవర్తి వెంకట రమేష్‌కుమార్, కోడూరు సుధీర్‌రెడ్డి, సుబ్బారావు, నరేష్‌బాబు, బాలసరేంద్రప్రసాద్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

---

## ఎంత కాలమని అమ్ముడుపోతాం!

మొన్న నంద్యాల, నిన్న కాకినాడ ఎన్నికలను చూసాం. ఓట్ల కొనుగోలు ఎంత బాగా పనిచేస్తుందో తెలుస్తోంది. డబ్బులిస్తే చాలు... మా భవిష్యత్‌ను అమ్ముకుంటాం అనే దుర్మార్గపు స్థితికి కొందరు లోనవుతున్నారు. ఈరోజు ఓటుకు వెయ్యిస్తే చాలు... రేపు మా బ్రతుకులేంటో అని ఆలోచించడం లేదు. రాజకీయ నాయకులు వెదజల్లే కోట్ల రూపాయలు వారికి ఎక్కడనుండి వస్తున్నాయి. అది మన డబ్బేగా! ఐదేళ్ళకోసారి వాళ్ళు ముష్టి మన మొహాన ఐదొందలో, వెయ్యో విసురుతాడు. కాని మనం ఐదేళ్ళపాటు ఎంత నష్టపోతున్నామో తెలుసా? ఉచితంగా పొందాల్సిన వైద్యం కోసం, చదువు కోసం ఎన్ని వేలు, లక్షల రూపాయలు వెచ్చిస్తున్నామో తెలుసా? గ్యాస్ రూపంలో, పన్నుల రూపంలో, పెట్రోల్, డీజిల్ రూపంలో మనల్ని చావగొడుతున్నా ఓటు అమ్ముకున్న ఒకే ఒక్క పాపానికి ప్రజాప్రతినిధులను ప్రశ్నించలేకపోతున్నాం.

**మోదేగుంట శ్రీహరి, కోవూరు.**

## నిర్మలకు అభినందనలు

ఇందిరాగాంధీ తర్వాత దేశ రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ మన తెలుగింటి కోడలు కావడం గర్వకారణం. ప్రధాని నరేంద్రమోడీ ఒక మహిళకు పెద్ద బాధ్యతనే అప్పగించారు. దేశ రక్షణనే మహిళల భుజస్కంధాల మీద పెట్టారు. నిర్మలాసీతారామన్ తనపై వుంచిన నమ్మకాన్ని సమర్థవంతంగా నెరవేర్చాలని ఆకాంక్షిస్తున్నాం.

**తోట సుప్రజ, తిరుపతి.**

## పందుల పని చూడండి

కావలి పట్టణంలో పందులను ఏరివేసారు. మరి నెల్లూరు నగరంలో అధికారులకు ఏమైందో... ఇంతవరకు వాటి జోలికి పోలేదు. అసలే నగరంలో అన్ని రోడ్లను తవ్వేసారు, ప్రతి వీధి రోతగానే వుంది. నడవాలన్నా కష్టంగానే వుంది. ఇది చాలదన్నట్లు ప్రతి వీధి లోనూ పందులు... అసలే వర్షాల సీజన్. ఈ పందుల దెబ్బకు ఎక్కడ రోగాలు ప్రబలి పోతాయోనని ప్రజలు భయపడుతున్నారు.

**సి. నాగేశ్వరరావు, నెల్లూరు.**



# అసలు పని వదిలేసి...

# అన్న క్యాంటిన్‌లు ఎందుకో?



**గుర్రం చేసే పని గుర్రం చేయాలి, గాడిద చేసే పని గాడిద చేయాలి... అని పెద్దలు చెప్పిన పాత మోటు సామెత అందరూ వినే వుంటారు. పారిశుధ్య కార్మికుడి పని వీధులను శుభ్రంగా ఉంచడం... ఆ పని అతనే చెయ్యాలి. అదే ఐఏఎస్ చదివిన కలెక్టర్ వచ్చి వీధులు వూడిస్తే ఎలా ఉంటుంది? సమాజంలో ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తిస్తే అసలు సమస్యలే వుండవు. ఎవరికి వాళ్ళు తమ బాధ్యతలను నిర్వర్తించకుండా ఇతర పనులవైపు చూస్తుండడం వల్లే సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్తవి పుట్టుకొస్తున్నాయి.**

ఇప్పుడు కార్పొరేషన్ వాళ్ళు అన్న క్యాంటీన్‌లు పెట్టి అర్జంట్‌గా ఈ చిరువ్యాపారుల కడుపు మీద కొట్టాల్సిన అవసరముందా? దానికంటే ముందు నగరంలో పారిశుధ్యం, పందులు, దోమలు, అస్తవ్యస్థంగా తయారైన రోడ్లు, సరిగా రాని మంచినీళ్ళు, రిజర్వ్ స్థలాల ఆక్రమణలు వంటి ఎన్నో సమస్యలున్నాయి. ముందు వాటి సంగతి చూడండి!

నగరపాలక సంస్థకు ఎన్నో బాధ్యతలుంటాయి. నగరంలో పారిశుధ్యాన్ని సక్రమంగా చూడడం, పందులు, దోమలు, కుక్కలు, కోతులు వంటివాటి బెడదను తొలగించడం, వీధి దీపాలను సక్రమంగా వెలిగేటట్లు చూడడం, మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థలను సక్రమంగా అమలు చేయడం, పన్నులను క్రమబద్ధంగా కట్టించుకోవడం, అక్రమ నిర్మాణాలను అరికట్టడం, పార్కులను ఏర్పాటు చేయడం... ఇలా ఒక నగరపాలక సంస్థ చేయాల్సిన బాధ్యతలు ఎన్నో వున్నాయి. వీటిని సక్రమంగా ఏడిస్తే చాలు... ప్రజలకు వాళ్లెంతో మేలు చేసిన వాళ్ళవుతారు.

కాని, మన నెల్లూరు నగర పాలకసంస్థ వాళ్ళు చేయాల్సిన ఈ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చకుండా నగరంలో అన్నక్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. అన్న క్యాంటీన్‌లు, అమ్మ క్యాంటీన్‌లతో వీళ్లకు ఏం పని. వీళ్లేదమైనా సివిల్ సప్లయిస్ సంస్థా? ప్రజలేమన్నా వీళ్లను క్యాంటీన్‌లు పెట్టమని అడిగారా? నగరంలో పందుల బెడద, దోమల రొద ఎక్కువైందని ప్రజలు మొరపెట్టుకుంటుంటే పట్టించుకునే దిక్కులేదు. అన్నక్యాంటీన్‌లు పెట్టమని వీళ్లను ఎవరు బ్రతిమలాడారు. నగరంలో పారిశుధ్య పనులైనా, పందులు, దోమల నిర్మూలనైనా కార్పొరేషన్ వాళ్ళే చేయాలి. ఇంకొకరొచ్చి చేసేది కాదు. కాని, కార్పొరేషన్ వాళ్ళు అన్నక్యాంటీన్‌లు పెట్టక పోయినా జనానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. నెల్లూరులో ఎవరూ తిండి లేక చావడం లేదు. మరి కడుపు నింపుకోవ డానికి ఆస్తులమ్ముకునేంత పరిస్థితులైతే లేవు. నెల్లూరులో ఏ స్థాయి వారికి తగ్గట్లు ఆ స్థాయి హోటళ్లు వున్నాయి. జేబులో పదివేలు వున్నోడు మినర్వాలో తింటాడు, వెయ్యి రూపాయలు వున్నోడు మయూరి రెస్టారెంట్‌లో తింటాడు, వంద మాత్రమే వున్నోడు మురళీకృష్ణకు వెళతాడు. పదో, ఇరవయ్యో వుంటే తోపుడు బండి వద్ద తింటాడు. నెల్లూరులో ప్లేట్ ఇడ్లీ 200 రూపాయలకు దొరుకుతుంది, అదే ప్లేటు ఇడ్లీ పది రూపాయలకూ దొరుకుతుంది. భోజనమైతే స్టార్ హోటల్‌లో 500 రూపాయలకు బఫే వుంది. రోడ్ల మీద బండ్ల వద్ద పాతిక రూపాయలకూ దొరుకుతుంది. మరీ డబ్బులు లేక అడుక్కునే వాళ్లకు దేవాలయాల వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాలు న్నాయి. కార్పొరేషన్ వాళ్లు అన్నక్యాంటీన్ పెట్టి ఒక చపాతిని 5రూపాయలకు ఇస్తారేమో? ఇదే చపాతి బయట పది రూపాయలకు కూడా దొరుకుతుంది. నెల్లూరు భోజనానికి, రుచికరమైన టిఫిన్‌లకు పెట్టింది పేరు. ఇక్కడ ఆహార పదార్థాలు ఖరీదుగానే కాదు చౌకధరల్లోనూ దొరుకుతాయి. ఈ హోటళ్లు, టిఫిన్ బండ్లు, టిఫిన్ అంగళ్లు పెట్టుకునే నగరంలో వేలాది మంది బ్రతుకుతున్నారు. తక్కువ ఖర్చుతోనే ఎన్నో వేలమంది కడుపులు నింపుతున్నారు.

## వైకాపాలోనూ...

# నేతలమధ్య కలతలు



రాష్ట్రంలోనే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలంగా వున్న జిల్లాల్లో నెల్లూరొకటి. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట లాంటి ఈ జిల్లా ఇప్పుడు వైకాపాకు పెట్టనికోట అయ్యింది. 2014 ఎన్నికల్లో నెల్లూరు, తిరుపతి ఎంపి స్థానాలతో పాటు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. ఆ రోజు నాయకుల మధ్య సమన్వయం లేక మూడు అసెంబ్లీ సీట్లలో ఓడిపోవాల్సి వచ్చింది.

జిల్లాలో తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు జాస్తిగా వున్నాయి. అధికారపార్టీ కాబట్టి ఆ మాత్రం విభేదాలు సహజమే! జిల్లాలోని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో ఆ స్థాయిలో వర్గపోరు లేకున్నా కొద్దిమంది నాయకుల మధ్య వున్న మనస్పర్థలు పార్టీకే చేటుగా మారే అవకాశాలున్నాయి.

కావలి నియోజకవర్గంలో పార్టీలో మూడు గ్రూపులయ్యాయి. 2014 ఎన్నికల్లో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం గట్టిగా పనిచేసిన మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి రేపు కావలి సీటు కోసం పోటీలో నిలవనున్నట్లు తెలుస్తోంది. అలాగే మరో మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి కూడా కావలి సీటును ఆశిస్తున్నాడు. ఎవరి ప్రమేయం లేకుండానే ఇటీవల ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లోనూ కావలి సీటు ప్రతాప్‌కే అని ప్రకటించడం ఇక్కడ పార్టీ నేతల మధ్య చిచ్చు పెట్టింది. 2014 ఎన్నికలప్పుడు కూడా నెల్లూరు నగరం, రూరల్, గూడూరు సీట్లకు తన అనుచరులను అభ్యర్థులుగా చేసుకోవాలని చెప్పి మేకపాటి ఇలాంటి తలనొప్పినే తెచ్చిపెట్టాడు. అభ్యర్థుల విషయంలో అధిష్ఠానం ముందుగా మేకపాటి నోటికి తాళం వేయాలి. గత ఎన్నికల్లో వెంకటగిరిలోనూ పార్టీ నాయకుల మధ్య సమన్వయం కుదరకపోవడం వల్లే అక్కడ అభ్యర్థిగా వున్న కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఓడిపోయాడు. ఉదయగిరిలోనూ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పోకడలు నచ్చక మండల స్థాయి నాయకులు చాలామంది దూరమయ్యారు. ఈసారన్నా వారిని దగ్గరకు చేర్చుకునే ప్రయత్నం చేయాలి. ఇక ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిలతోనూ పార్టీలో కొందరు నాయకులకు పడడం లేదు. వచ్చే ఎన్నికల లోపు నేతల మధ్య కలతలను రూపు మాపి, కేడర్‌ను ఒకేతాటిపై నడిచే విధంగా అధిష్ఠానం దృష్టి పెట్టాల్సి వుంది.

## కలసిరాని నేతలతో...

# 'ఆనం'దం ఆవిరి



### రామనారాయణకు చెవిలో జోరీగలాగా మారిన కన్నబాబు

**ఏదైనా కాంగ్రెస్‌పార్టీ కాంగ్రెస్‌పార్టీయే... ఆ పార్టీలో ఉన్నంత సంతోషం, ఆ హోదా, ఆ దర్జా, ఆ అధికారదర్పం ఇంకే పార్టీలోనూ రాదు. అక్కడ కోపం వస్తే క్రిందిస్థాయి నాయకుడినే కాదు, ఢిల్లీలో వున్న నాయకులను కూడా నోరారా తిట్టుకోవచ్చు. ఒక్క ఇందిరాగాంధీ కుటుంబసభ్యులను తప్పితే ప్రధానమంత్రిగా వున్న నాయకుణ్ణి తిట్టినా ఎవరూ ఏమీ అనరు. ఎందుకంటే పార్టీలో ప్రజాస్వామ్యం ఘనంగా వర్ధిల్లుతుందని చెప్పడానికి దీనినే నిదర్శనంగా చెబుతుంటారు.**

చెరువులోని చేపపిల్లలను నీళ్ల తొట్టెలో వేస్తే ఎలా వుంటుందో, సముద్రం లాంటి కాంగ్రెస్‌పార్టీ నుండి నీటితొట్టెల్లాంటి ప్రాంతీయ పార్టీల్లోకి వస్తే పరిస్థితులు ఎంత దారుణంగా వుంటాయో నాయకులకు ఇప్పుడు తెలుస్తుంటోంది. కాంగ్రెస్ నుండి బయట కొచ్చి తప్పు చేశామా అని బాధపడేవాళ్ళలో నెల్లూరుజిల్లా నుండి ఖచ్చితంగా ఆనం సోదరులు వుంటారు. కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలో చేరాక ఈ పార్టీలో వాళ్ళకు ఇస్తున్న ప్రాధాన్యత, గౌరవం చూస్తుంటే ఖచ్చితంగా వారి మనసులో ఆ అభిప్రాయం ఏర్పడకుండా వుండదు.

2015లో ఆనం రామనారాయణరెడ్డి, ఆనం వివేకానందరెడ్డిలు కూడబలుక్కుని తెలుగుదేశంలో చేరారు. చంద్రబాబు ఏం హామీలిచ్చాడో, ఏం మాటలు చెప్పాడోగాని వీళ్ళు ఎగురుకుంటూ సైకిలెక్కేసారు. కాంగ్రెస్‌లోలాగే జిల్లాలో తెలుగుదేశం పెత్తనాన్ని చేతుల్లోకి తీసేసుకోవచ్చనుకున్నారు. కాలం గడిచే కొద్ది పార్టీయే తమ వద్దకు నడిచొస్తుందనుకున్నారు. తీరాచూస్తే ఇక్కడంత సీన్ లేకుండాపోయింది. వీళ్ళు దూసుకుపోవడానికి ఎక్కడా సందు దొరకలేదు. జిల్లా టీడీపీలోవున్న ముదుర్లు వీళ్లకు ఛాన్స్ ఇవ్వలేదు. చంద్రబాబు కూడా వీళ్లకు అంత ప్రాధాన్యత నివ్వలేదు. ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ ఇవ్వడం తప్పించి పార్టీలో ఇక ఏ బాధ్యత ఇవ్వలేదు. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాలలో వీరిని వేలు పెట్టనీయలేదు. ఆనం వివేకా ఎమ్మెల్సీ ఆశిస్తే అదీ దక్కలేదు. వివేకాకు ఎమ్మెల్సీ ఇవ్వలేదని అలిగే జిల్లా తెలుగు యువత అధ్యక్ష పదవి ఇచ్చినా ఆనం రంగమయూర్‌రెడ్డి తీసుకోలేదు.

ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ ఇచ్చారు. అలాగే గూటూరు కన్నబాబు అనే పక్కలో బల్లెన్ని పెట్టారు. ఆత్మకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు రెండు గ్రూపులయ్యాయి. కన్నబాబు చాపక్రింద నీరులా ఆనంకు వ్యతిరేక రాజకీయాలు చేస్తున్నాడు. పార్టీ జిల్లా (మిగతా 11వ పేజీలో)

# నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి



- మిస్‌ఫైర్ సంఘటనలో ఏఎస్పీ డ్రైవర్ రమేష్ మృతి
- ఘటనపై లోతుగా దర్యాప్తు

నిర్లక్ష్యమో, పోలీసుల తుపాకులు పేలవన్న నమ్మకమో, తొందరపాటులో ఏమరపాటో... కారణం ఏదైనా ఓ నిండు ప్రాణం పోయింది. నూరేళ్ల భవిష్యత్తు 32 ఏళ్లకే సమాధి అయ్యింది. ఈ నెల 2వ తేదీన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ శరత్‌బాబు గన్‌మెన్ నాగేంద్ర చేతిలో వున్న ఏ.కె.47 మిస్‌ఫైర్ కావడంతో ఛాతిలోకి బుల్లెట్లు దూసుకుపోయి ఏఎస్పీ కారు డ్రైవర్ మండ్ల రమేష్ అసువులు బాయడం జిల్లాలోనే తీవ్ర సంచలనం రేపింది. వివరాలలోకి వెళితే... ఏఎస్పీ శరత్‌బాబు వద్ద మండ్ల రమేష్ డ్రైవర్‌గానూ, నాగేంద్ర గన్‌మెన్‌గానూ వుంటున్నారు. 2వ తేదీ ఏఎస్పీ తోటే వీళ్ళు డ్యూటీలో వున్నారు. ఆరోజు రాత్రి 10గంటల సమయంలో జిల్లా పోలీసు ఆఫీసులో ఎస్పీ రామకృష్ణ ఉన్నాడని తెలుసుకున్న ఏఎస్పీ శరత్‌బాబు నేరుగా అక్కడకు వెళ్లాడు. కారు ఆగిన తర్వాత ముందు సీట్లో కూర్చున్న గన్‌మెన్ నాగేంద్ర డోర్ తీసుకునే సమయంలో ఏ.కె.47 ఉన్నట్లుండి పేలింది. రెండు బుల్లెట్లలో ఒకటి డ్రైవర్ సీటులో వున్న రమేష్ ఛాతిలోకి, ఇంకోటి పక్కటెముకల్లోకి దూసుకుపోయింది. ఈ సంఘటనతో కలవరపడ్డ సిబ్బంది వెంటనే రక్తపు గాయాలతో వున్న రమేష్‌ను బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ, ఏఎస్పీలు కూడా వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. రమేష్‌ను బ్రతికించడానికి బొల్లినేని వైద్యులు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఆసుపత్రిలోనే రమేష్ కన్నుమూశాడు. మండ్ల రమేష్‌ది సీతారాంపురం. 2009లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. అప్పటినుండి ఎక్కువకాలం ఏఎస్పీల వద్ద డ్రైవర్‌గానే పనిచేస్తున్నాడు. రమేష్ మృతితో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. రమేష్ కుటుంబసభ్యులు మాత్రం తమ బిడ్డ మృతిపై అనుమానాలు వ్యక్తం చేసారు. ఏఎస్పీ మీద గన్‌మెన్ నాగేంద్ర మీద అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆరోపణలు చేశారు. గన్‌మెన్ నిర్లక్ష్యం, అజాగ్రత్త కారణంగానే ఈ సంఘటన జరిగిందని ఎస్పీ రామకృష్ణ చెప్పారు. అలాగే ఈ సంఘటనలో కుటుంబసభ్యులు అనుమానించిన దిశగా కూడా విచారణ జరిపిస్తామన్నారు. ఏదేమైనా మన నిర్లక్ష్యం వల్ల ఆస్తి రూపంలోనో, ఇంకో రూపంలోనో నష్టం వాటిల్లితే భర్తీ చేసుకోవచ్చు. కాని, నిండు ప్రాణం రూపంలో ఆ నష్టం వుంటే భర్తీ చేసుకునే మార్గమే లేదు.

## వైద్యులు చిత్తశుద్ధి చూపిస్తే...

# ప్రైవేట్ దిగదుడుపే!



సర్కార్ దవాఖానా అంటే నరకానికి నమూనా అన్న ఒక పేరుంది. నిజమే... ఇంతకాలం మనం చూసిన పెద్దాసుపత్రిలో పరిస్థితి అదే! ఒక రోగంతో ఆసుపత్రికి వెళితే బోనస్‌గా ఇంకొన్ని రోగాలు తగులుకునేంత దుస్థితి వాతావరణం అక్కడ ఉండేది. అయితే కాలం మారింది. ప్రభుత్వ వైద్య కళాశాల వచ్చాక పెద్దాసుపత్రి ప్రాంగణం రూపురేఖలే మారిపోయాయి. ఈ ప్రాంగణంలో ఎటుచూసినా కార్పొరేట్ కంపెనీలులాగా వున్న భవనాలు, విశాలమైన రోడ్లు, సెంట్రల్ లైటింగ్, పచ్చదనం... కనువిందు చేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే నెల్లూరులో వున్న కార్పొరేట్ ఆసుపత్రులకంటే కూడా ఇప్పుడు పెద్దాసుపత్రి ప్రాంగణంలో వాతావరణమే బాగుంది. ఒకప్పుడు మనకు నరకంలా అనిపించిన పెద్దాసుపత్రిని పాత భవనాల నుండి కొత్తగా కట్టిన భవనాలలోకి త్వరలోనే ప్రభుత్వ సర్వజన వైద్యశాలగా తరలించనున్నారు. వందకోట్ల వ్యయంతో ఈ ఆసుపత్రి భవనాలు పూర్తి కావచ్చాయి. మొత్తం 750 పడకలతో, అత్యాధునిక వైద్య పరికరాలతో ఆసుపత్రిని సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కంటి, ఆర్థోపెడిక్ విభాగాలను అనధికారికంగా ప్రారంభించి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ ఆసుపత్రి ప్రాంగణంలోకి అడుగుపెట్టిన వాళ్ళు ప్రైవేట్ ఆసుపత్రులకంటే ఈ ఆసుపత్రి ఎంతో బాగుందని ఆనందిస్తున్నారు. త్వరలోనే మిగిలిన అన్ని వైద్య విభాగాలను ఇక్కడకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆసుపత్రిని అందంగా కట్టారు. వైద్యులు కూడా అంతే అందమైన మనస్సుతో వైద్యసేవలందిస్తే చాలామంది పేదరోగులకు జబ్బుల కోసం ఆస్తులు అమ్ముకునే పరిస్థితిని తప్పించిన వాళ్లవుతారు.

# నెల్లూరు కబుర్లు

## చంద్రబాబు రావట్లేదు?

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 8వ తేదీన నెల్లూరు వస్తారని ప్రచారం చేసినప్పటికీ ఆయన రావడం లేదు. ఆరోజు మధ్యాహ్నం 3గంటలకు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శత వసంతోత్సవ వేడుకలకు ఆయన హాజరవుతారని ముందుగా అనుకున్నారు. ఈమేరకే కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గం భారీ ఏర్పాట్లు చేసింది. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర కూడా సిఎం వస్తున్నాడని చెప్పి ఏర్పాట్లు పరిశీలించారు. అయితే చివర్లో ఆయన నెల్లూరు పర్యటనను రద్దు చేసుకున్నారు. అదే రోజు అనంతపురంలో పర్యటనకు వెళుతున్నారు. కేంద్ర సహకార బ్యాంకు వందేళ్ళ ఉత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వస్తాడనుకుని ఎదురు చూసిన పాలకవర్గానికి నిరాశే మిగిలింది.

## లంచాలకు చెక్ పెట్టేందుకు!




నెల్లూరులో ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో లంచాల పీడ వదిలించేందుకు అనేక చర్యలు చేపట్టారు. కార్యాలయంలోకి పనిమీద వెళ్లే వారిని మాత్రమే అనుమతిస్తున్నారు. గేటు వద్దే సెక్యూరిటీ వుండి వచ్చేవారి వివరాలు తీసుకుని, వాస్తవంగా పని మీద వచ్చేవారినే లోపలకు పంపిస్తున్నారు. ఏజంట్లను కాని ఇతర పైరవీకారులను కాని లోపలకు పంపించడం లేదు. జర్నలిస్టులు కాకుండా జర్నలిస్టుల పేర్లు చెప్పుకుని దబాయించే వాళ్లను కూడా లోపలకు పోనీయడం లేదు. అలాగే కార్యాలయంలో అన్ని సెక్షన్‌ల వద్ద అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు వ్రాసి లంచాలు అడిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1100కు గాని లేదా నేరుగా డిటిసి సెల్ నెంబర్ 9848528385కు గాని ఫోన్ చేయొచ్చని సూచించారు. ఈ మార్పులు పకడ్బందీగా అమలు జరగాలని ఆశిద్దాం.

## ఇది దయ గల గోడ




నెల్లూరు, పొదలకూరురోడ్డులో రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి గోడ మీద 'దయగల గోడ' అనే ఒక నినాదం వ్రాసి వుంటుంది. మనిషిలోని మానవతకు ఇదో మంచి ఉదాహరణ. ఎవరైనా మనసున్న మారాజులు తమ పాత బట్టలను ఇక్కడ పెట్టేసి పోవచ్చు. అలాగే భిక్షగాళ్ళు, కడుపేదలు, చింపిరి గుడ్డలతో సభ్య సమాజంలో బ్రతుకు వెళ్లదీస్తున్న అనామకులు తమకు సరిపోయే బట్టలను ఇక్కడ తీసుకోవచ్చు. ఒక్క బట్టలనే కాదు, దాతలు తమకు పనికిరాని వస్తువులు ఏవైనా ఇక్కడ వదల వచ్చు. నిరాశ్రయులకు అవి ఎంతగానో ఉపయోగపడతాయి.



## దుమ్ము దులిపిన వాన!

ఈ ఏడాదికి నెల్లూరుకు సంబంధించిన భారీవర్షంగా ఈ నెల 3వతేదీ కురిసిన వర్షాన్ని చెప్పుకోవచ్చు. నెల్లూరు నగరంలో ఒకటిన్నర గంట పాటు వాన దంచి కొట్టింది. రోడ్ల మీద నీళ్ళు కాలువలు కట్టాయి. యధాఫలంగా అండర్ బ్రిడ్జిలలో నీళ్లు చేరిపోయి వాహనాలు అటు ఇటు ఆగిపోయాయి. ఇక నగరమంతా సిమెంట్ రోడ్లను తవ్వేసి వుండడంతో ఆ రోడ్లపై జనానికి అగచాట్లు తప్పలేదు. అయితే ఈ కష్టాల కంటే కురిసిన భారీవర్షమే జనాల్లో సంతోషాన్ని తెచ్చింది.

## రాఘవేంద్రకు రోటరీ అవార్డు




రొటేరియన్ బి.రాఘవేంద్రషెట్టి 2016-17 సంవత్సరానికిగాను ఉత్తమ రోటరీ కార్యదర్శి అవార్డును అందుకున్నారు. 3వ తేదీ తమిళనాడులోని కొడైకెనాల్‌లో జరిగిన రోటరీ ఇంటర్నేషనల్ సమావేశంలో రోటరీ ఇంటర్నేషనల్ డైరక్టర్ భాస్కర్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. రోటరీ క్లబ్ నెల్లూరు కార్యదర్శిగా రాఘవేంద్రషెట్టి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. రోటరీ క్లబ్ శ్మశాన వాటికలో ఇటీవల దాతల సాయంతో 60లక్షలతో వసతులు కల్పించారు. ఆయన కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేశారు.

## బి.వి.నగర్‌లో 'జోష్'



ఈనెల 1వతేదీన నెల్లూరులోని జోష్ బేకరి ఫుడ్స్ వారు బి.వి. నగర్‌లో ఏర్పాటు చేసిన మూడవ బ్రాంచ్ జోష్ కేక్స్ అండ్ చాట్స్‌ను నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేత వై.వెంకటేశ్వర్లు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## కమనీయం... రాధాకృష్ణుల పల్లకీ సేవ




రాధాష్టమి, జన్మాష్టమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నెల్లూరు హరనాథపురంలో శ్రీరాధాకృష్ణ పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో కమనీయంగా జరిగింది. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డా|| సుఖదేవస్వామి ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి పల్లకీసేవ వేడుకగా సాగింది. హరేకృష్ణ నామస్మరణలతో భజనలతో, కీర్తనలతో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

## మున్సిపల్ విద్యార్థులకు పుస్తకాల వితరణ



నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1న పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ అసోసియేషన్ సంస్థ ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా ప్రతిఏటా మునిసిపల్ విద్యార్థిని విద్యార్థులకు సుమారు 1100 మందికి నోటు పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్, 1 పెన్ వంతున అందరికీ అందజేస్తుండడం ఎంతైనా అభినందనీయమని వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ ఢిల్లీరావు, కార్పొరేటర్లు ఉచ్చి భువనేశ్వరప్రసాద్, నాయకులు మల్లికార్జున యాదవ్, వేలూరు సుధారాణి తదితరులు పాల్గొని విద్యార్థులకు నోటుపుస్తకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పేద విద్యార్థులకు అసోసియేషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, నగర సుందరీకరణకు, నగరంలో పచ్చదనం -పరిశుభ్రత పరిరక్షణకు కూడా ఈ అసోసియేషన్‌వారు సహకరించాలని కోరగా, అందుకు అసోసియేషన్ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు అమరా మోహనరావు, ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసన్నాంజనేయులు, కోశాధికారి జె.శోభన్ బాబు, ఛైర్మన్ జె.రవికుమార్, అసోసియేషన్ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

# బడ్జెట్ కూడా అంత లేదు!

**- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర**



ఈ మూడేళ్ల పాలనలో చంద్రబాబు మూడు లక్షల కోట్లు దోచుకున్నాడని ప్రతి పక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఆరోపిస్తున్నాడని, అసలు ఈ మూడేళ్లలో రాష్ట్ర బడ్జెట్ మూడు లక్షల కోట్లు లేదని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఎద్దేవా చేశాడు. 4వ తేదీ నెల్లూరులోని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల, కాకినాడ ఎన్నికలే జగన్ బ్రతుకును, భవిష్యత్‌ను తేల్చాయని, ఓటర్లు ఛీకొట్టినా జగన్‌కు బుద్ధి రాకపోవడం శోచనీయమన్నారు. చంద్రబాబును రాష్ట్రానికి పట్టిన శని అని జగన్ అంటున్నాడని, కాని అసలు శని ఎవరో వారం క్రితం రాష్ట్ర ప్రజలే తేల్చి చెప్పారన్నారు. వై.యస్.రాజశేఖరరెడ్డి సీఎంగా వున్నప్పుడు నవరత్నాల ప్రాజెక్ట్‌ల పేరుతో దోచుకున్నాడని, అదే నవరత్నాల పేరుతో మళ్ళీ జగన్ రాష్ట్రాన్ని దోచుకునేందుకు కుట్ర పన్నుతున్నాడని ఆరోపించారు. కాపులకు న్యాయం చేసింది చంద్రబాబేనని, కాపు కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా కాపుల అభివృద్ధికి విశేష కృషి జరుగుతుందన్నారు. కాపుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు గాని, ముద్రగడ పద్మనాభంకు గాని లేదన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మిస్‌ఫైర్ దుర్ఘటనలో మృతిచెందిన ఏఎస్పీ డ్రైవర్ రమేష్ మృతికి ఆయన విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, ఆప్కాబ్ ఛైర్మెన్ కొండూరు పాల్‌శెట్టి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డి.సుబ్బారావు, ప్రభుత్వ సుపత్రి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహరావు పాల్గొన్నారు.



# దండిగా సేవలు చేస్తున్న బండి

**- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశంస**

పాఠశాలలో చదువుకునే నిరుపేద విద్యార్థుల కోసం దాత బండి ఆదినారాయణరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమైనవని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశంసించారు. నగరంలోని 24వ డివిజన్‌లోని పడారుపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈ నెల 4న స్కూల్‌బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, అనాథలకు పేదలకు మనం అండగా నిలబడితే ఆ భగవంతుడు మనకు అండగా నిలబడతాడన్నారు. మానవసేవే మాధవసేవ అని గ్రహించి అందరూ సేవాభావంతో పేదలకు అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాతపాటి పుల్లారెడ్డి, యనమల మల్లికార్జునరెడ్డి, పామూరు మస్తాన్‌రెడ్డి, దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, పామూరు శ్రీనివాసులురెడ్డి, కాకుటూరు వెంకటసుబ్బయ్య, కాళహస్తి గోపాల్‌రెడ్డి, త్యాగం సుబ్బారెడ్డి, బొగ్గల చంద్రశేఖర్‌రెడ్డి, వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నగళ్ల బాపూజీ, పామూరు నాని తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌సిటీనా?.. మురికివాడకు పోటీనా?

**- వైఎస్సార్సీపి నాయకుల ధ్వజం**



నెల్లూరు నగరం నానాటికీ పరమ అధ్వాన్నంగా మారుతోందని, మురుగు గబ్బు..బురదరోడ్లతో చెత్తనగరంగా మారిందని, స్మార్ట్‌సిటీ అంటే ఇదేనా?..అని డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైఎస్సార్సీపి ఫ్లోర్‌లీడర్ రూప్‌కుమార్ యాదవ్ దుయ్యబట్టారు. ఈ నెల 4న కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కార్పొరేషన్ తీరుపై ధ్వజమెత్తారు. నగరం అభివృద్ధి పేరుతో రోడ్లను ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చినుకు పడితే చాలు రోడ్లు బురదరోడ్లుగా మారుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్నారు. రోడ్లలో మురుగునీరు నిలిచి ప్రజలు విషజ్వరాల బారినపడుతున్నారని, సంబంధిత అధికారులు మాత్రం ప్రజల అవస్థలు పట్టించుకోకుండా 'హ్యాపీ సండే' పేరుతో సంబరాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. గత ఏడాది అక్టోబర్‌లో కౌన్సిల్ సమావేశం నిర్వహించారని, ఆ తర్వాత ఇప్పటిదాకా సమావేశం విషయం పట్టించుకోవడం లేదని, కౌన్సిల్ సమావేశాన్ని ఎందుకు వాయిదా వేయాల్సి వస్తోందని వారు ప్రశ్నించారు. నగర కార్పొరేషన్ తీరు మరీ దారుణంగా ఉందన్నారు. నగర ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేని స్థితిలో అధికారులున్నారని విమర్శించారు. రోడ్ల గుంతలతో పరమఅధ్వాన్నంగా ఉన్నా, ప్రజలకు విషజ్వరాలు ప్రబలుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని, కార్పొరేషన్ పాలన పూర్తిగా కుంటుపడిపోయిందని వారు విమర్శించారు. ప్రజల ఇబ్బందులు తీర్చడంలో అలసత్వం ఎంతమాత్రం పనికిరాదన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, ఊటుకూరు మాధవయ్య, దామవరం రాజశేఖర్, వేలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే విలువలకు శోభ




ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో గురు పూజోత్సవ వేడుకలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, జిల్లా పరిషత్ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డి, శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం, వాకాటి నారాయణరెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, మంత్రి ఓఎస్‌డి సి.హెచ్.పెంచలరెడ్డి, డిఇఓ మువ్వా రామలింగం, సర్వశిక్ష అభియాన్ పి.ఓ విశ్వనాథ్, విశ్రాంత అధ్యాపకులు కె.నరసింహారెడ్డి, ప్రముఖ ఛార్టర్డ్ అకౌంటెంట్ శ్రీనివాసులు పాల్గొని మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముత్యాలరాజు మాట్లాడుతూ విద్యతోనే మనిషిలో విలువలు ప్రకాశిస్తాయని, విలువలు, వినయం లేని విద్య వృధాయేనన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో పోటీతత్వం నడుస్తోందని, దీనివల్ల అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని అన్నారు. ఉపాధ్యాయులు మండల కేంద్రాలలో గాని, గ్రామాలలో గాని నివాసముంటే తమ ఉద్యోగ ధర్మానికి పూర్తిగా న్యాయం చేసినవారవుతారని చెప్పారు. ఆలిండియా స్థాయిలో గేట్ మొదటి ర్యాంకర్ సుధీర్ మరణం తనను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 53మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు.

# శ్రీసిటీలో సిపిఐ రామకృష్ణ



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఈ నెల 5వ తేదీ తడ సమీపంలోని శ్రీ సిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, సెజ్ మౌలిక వసతులు, ప్రత్యేకతలు, పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు. రామకృష్ణ లేవనెత్తిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం ఆయన శ్రీసిటీ పరిసరాల్లో పర్యటించి పారిశ్రామిక ప్రగతిని నేరుగా వీక్షించారు. రాక్వర్, ఎవర్టన్ పరిశ్రమలను సందర్శించి అక్కడి ఉత్పత్తులు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, వెనుకబడ్డ ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గంలో శ్రీసిటీ ద్వారా 35 వేలకు పైగా ఉద్యోగాలు రావడం చాలా మంచి పరిణామంగా పేర్కొన్నారు. పరిశ్రమల్లో పనిచేసేవారికి భోజన, వాహన సదుపాయాలతో పాటు పనిచేసే వాతావరణం ఎంతో బాగున్నట్లు కార్మికులు తనతో చెప్పారన్నారు. శ్రీసిటీ అభివృద్ధికి స్థానికుల సహకారం కూడా బాగావున్నట్లు తనకు తెలిసిందన్నారు. భవిష్యత్తులో శ్రీసిటీ మరింత అభివృద్ధి సాధిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృషిని ఆయన అభినందించారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, జిల్లా కార్యదర్శి రామానాయుడు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# ఇసుక రవాణాపై మరికొన్ని నిబంధనలు

**- ఎస్పీ రామకృష్ణ**



జిల్లాలో ఇసుక రవాణాకు సంబంధించి మరికొన్ని ఆంక్షలు విధిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిన ధర ప్రకారమే వినియోగదారుడి నుంచి నగదు తీసుకోవాలన్నారు. ఒక యూనిట్ లేదా మూడు క్యూబిక్ మీటర్లకు 300 రూపాయలు చెల్లించాలని, గమ్యస్థానాన్ని బట్టి రవాణా ఛార్జీలు నిర్ణయించామని పేర్కొన్నారు. ఇసుక రీచ్ నుంచి 5 కిలోమీటర్ల దూరానికి రూ.400, పది కిలోమీటర్ల దూరానికి 600, 30 కిలోమీటర్ల దూరానికి 1200 వందలు, ఆపై దూరానికి ప్రతి కిలోమీటర్‌కు 30 రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. నిర్ణయించిన ధరలకన్నా అధికంగా వసూలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లకు ఈ నెల 8వ తేది లోపు జిపిఎస్ పరికరాన్ని ఏర్పాటుచేసుకోవాలని, జిపిఎస్ లైన్ డేటాను స్పెషల్‌బ్రాంచ్ రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే వ్యాట్సాప్ నంబరు 93907 77727 నంబరుకు సమాచారం అందివ్వాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# మంచి చెడులు నేర్పించేది గురువే!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్

సమాజంలో మంచి చెడులను, జీవితంలో నడుచుకోవాల్సిన నడవడికను నేర్పించేది, నేర్పేది ఒక్క గురువు మాత్రమేనని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జీఎస్ఆర్ పురపాలక పాఠశాలలో వేర్వేరుగా గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల క్రీడలను సోమవారం ఆయన ప్రారంభించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరికి మంచిమార్గాన్ని చూపి, నడిపించే సత్తా ఒక్క గురువుకు మాత్రమే ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరేలా చదివించేది, వారికి తగిన నైపుణ్యం, గుర్తింపు వచ్చేలా చేసేది గురువు మాత్రమేనని తెలిపారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు కూడా మరో నాలుగు నెలల్లో తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓలు సూర్యనారాయణ, మధుసూధనరావు, ఎంపిడిఓ భవాని, తెలుగుదేశం నాయకులు సోమిసెట్టి చెంచురామయ్య, సురేష్, ప్రముఖులు దండు జయరామిరెడ్డి, సుబ్బారెడ్డి, ఎస్సై నరేష్, పురపాలక కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు

## సీనియర్ ఆడిటర్ శ్రీకంటి నాగరాజారావు మృతి



గూడూరు రెండో పట్టణంలో వున్న సీనియర్ ఆడిటర్, ఇన్‌కంటాక్స్ ప్రాక్టీషనర్, పిఆర్ క్లబ్ కార్యదర్శి, సాయిబాబా మందిరం కమిటీ కార్యదర్శి, సీనియర్ లయన్స్‌క్లబ్ మెంబర్, గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ గౌరవాధ్యక్షుడు శ్రీకంటి నాగరాజారావు ఈ నెల 1వ తేదీ అకాలమరణం చెందారు. ఈయన గూడూరు సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్, యస్.వి.రత్నం ఛారిటీస్ అధినేత మరియు గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం చీఫ్ అడ్వయిజర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు సోదరుడు. అన్నదమ్ములు ఇద్దరు కలిసి గూడూరు పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. శ్రీకంటి నాగరాజారావు మృతికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, గూడూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కె.కోటేశ్వరరావు, వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, ప్రముఖవైద్యులు డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, సి.రోహిణి, గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు యరగుడిపాటి చలపతిరావు, ఆనిమెళ్ళ శివకుమార్, బ్రాహ్మణ సేవాసంఘం ప్రతినిధులు, షేక్ రియాజ్ అహ్మద్, వివిధ రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. నాగరాజారావు మృతి తీరనిలోటని వారు తెలిపారు.

## ఎల్‌పిపిలో ఓనం వేడుకలు



గూడూరు పట్టణంలోని ఎల్‌పిపి పాఠశాలలో కేరళ ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల యాజమాన్యం సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో కేరళ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు మహిళా మొక్కలు



గూడూరు మున్సిపల్ జడ్పీ గర్ల్స్ హైస్కూల్లో టీచర్స్‌డే సందర్భంగా ఈ నెల 5వ తేదీ ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకే మొక్కలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు పి.ప్రభారెడ్డి, సౌందర్యమ్మ, విష్ణువందన తదితర సభ్యులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కన్వీనర్ వాసుగౌడ్

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని మాట ఇచ్చిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ గూడూరు బ్రాంచ్ కన్వీనర్ వాసుగౌడ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో "అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్రకు తరలిరండి" అనే గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. చైతన్య యాత్రలో బాధితులందరూ కలిసికట్టుగా వచ్చి విజయవంతం చేయాలని తెలిపారు.


**ఉత్తరక్రియలు**



మా అన్నగారు
**శ్రీకంటి నాగరాజారావు గారు**
తేది. 1.9.2017 శుక్రవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
సోదరుడు: శ్రీకంటి రామమోహనరావు
కుమారుడు: శ్రీకంటి మనోజ్‌కుమార్

**ఉత్తరక్రియలు**
తేది 9.9.2017 శనివారం నిత్యకర్మ
తేది 10.9.2017 ఆదివారం దశాహాన్ను
తేది 11.9.2017 సోమవారం సపిండీకరణ
తేది 12.9.2017 మంగళవారం ఆశీర్వచనము
తేది 13.9.2017 బుధవారం వైకుంఠ సమారాధన
గూడూరు, మాళవ్యానగర్‌లోని మా స్వగృహము నందు


# మహానేత.. మన రాజన్న



**డా. వైఎస్‌కు నేతల ఘననివాళి**

దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి మహానేత అని, రాష్ట్రప్రజల అభ్యున్నతికి ఆ మహనీయుడు చేసిన కృషి చిరస్మరణీయమని వైఎస్సార్సీపి నాయకులు పేర్కొన్నారు. ఈనెల 2న డా.వైఎస్ 8వ వర్ధంతి సందర్భంగా ఆ మహోన్నత నేతకు నాయకులందరూ ఘనంగా నివాళులర్పించారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ కూడలిలో ఉన్న డా.వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు డా.వైఎస్ ప్రజలకు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. డా.వైఎస్ భౌతికంగా మన మధ్య లేకున్నా తెలుగు ప్రజల గుండెల్లో ఆయన శాశ్వతంగా నిలిచేవున్నారని ఈ సందర్భంగా నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, డా.వైఎస్ రాష్ట్రానికి రామరాజ్యాన్ని అందించారన్నారు.



అలాగే, కరెంట్ ఆఫీసు సెంటర్‌లోని వై.యస్. విగ్రహానికి నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి వై.యస్. చేసిన సేవలను ఆయన గుర్తు చేశారు. జగనన్న సారథ్యంలో మరోసారి వై.యస్. రాజ్యాన్ని సాధిద్దామని నినదించారు. పలువురు కార్పొరేటర్లు, వైకాపా నాయకులు కూడా వై.యస్. నివాళులర్పించారు. వై.యస్. వర్ధంతి సందర్భంగా నెల్లూరు కార్పొరేషన్‌లోని 54 డివిజన్‌లలో స్థానిక కార్పొరేటర్లు, వైకాపా నాయకులు వై.యస్. చిత్రపటాలను ఏర్పాటు చేసి అన్నదానం, వస్త్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాలలో కూడా వై.యస్. వర్ధంతి సందర్భంగా అభిమానులు ఆయన చిత్రపటాలను ఏర్పాటు చేసి శ్రద్ధాంజలి ఘటించారు.



# వృద్ధులకు బులియన్ మర్చంట్స్ పింఛన్లు



ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న 48 మంది వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేశారు. అసోసియేషన్‌వారు నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాల్లో భాగంగా గత కొన్నేళ్ళుగా అనేక మంది వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడం కూడా జరుగుతోందని ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అమరా మోహన్‌రావు, కార్యదర్శి మట్టా ప్రసన్నాంజనేయులు, కోశాధికారి కొనగళ్ళ శోభన్‌బాబు, ఈ కార్యక్రమ ఛైర్మెన్ మెంటా చంద్ర, సభ్యులు మల్లికార్జున్, శ్రీధర్, జమిలి శ్రీనివాసరావు, రాజా మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# టీడీపీ విజయోత్సవ సభలో అజీజ్‌కు సన్మానం

గుంటూరులోని హాలిడే రిసార్ట్స్. నంద్యాల అసెంబ్లీ, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించాక తెలుగుదేశంపార్టీ అధినేత, హైటెక్‌రత్న చంద్రబాబు అక్కడ విజయోత్సవ సభ నిర్వహణకు ఏర్పాటు చేశారు. ప్రాంగణమంతా చంద్రబాబు, లోకేష్‌ల ఫ్లెక్సీ కటౌట్‌లతో పార్టీ జెండాలు, బ్యానర్‌లతో అలంకరించారు. నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ నాయకులను ఈ సభలో సన్మానించనున్నట్లు చంద్రబాబు ముందురోజే ప్రకటించారు. దీంతో నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో తెగ కష్టపడ్డ సింహపురి చాణక్య సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, చప్పిడిరాళ్ల ఆదినారాయణరెడ్డి, ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, పి.నారాయణ, గంటా శ్రీనివాసరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, సుజయ్‌కృష్ణ రంగారావు, బండారు సత్యనారాయణ, నిమ్మకాయల చినరాజప్ప... తదితర శ్రమజీవులు శుభ్రంగా స్నానం చేసి సెంటు కొట్టుకుని హాలిడే రిసార్ట్స్‌కు వచ్చారు. వీళ్లకు సన్మానం చేస్తున్నారనే నమ్మకంతో వారి అనుచరులు కూడా శాలువాలు, పూలమాలలతో భారీగా వచ్చారు. సోమిరెడ్డి హాల్‌లోకి వెళ్లే సమయంలో నెల్లూరు నుండి వెళ్లిన ఆయన అనుచరులు డాక్టర్ జడ్.శివప్రసాద్, మునుకూరు రవికుమార్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డిలు ఆయన వద్దకెళ్లి... సార్, ఈ సభలో మొదటి సన్మానం మీకే వుంటుంది, ఎందుకంటే అందరికంటే ఎక్కువ కష్టపడింది మీరే కదా. మీకు సన్మానం చేసేటప్పుడు మేం బయట భారీగా బాణా సంచా కాల్చాలి, అందుకు బయటే వుంటాం, మీరు శుభ్రంగా వెళ్లి సన్మానంతో తిరిగి రండి... శాలువాలు మోయడానికి ఇంకో మనిషిని పక్కన పెట్టుకోండి అని చెప్పి పి.ఏ హజరత్‌ను లోపలకు పంపించారు.

హాల్‌లో విజయోత్సవ సభ మొదలైంది. కొందరు మంత్రులు మాట్లాడ్డం అయిపోయాక లోకేష్ మైకందుకుని... ఈ ఉపఎన్నికలు మీ నాయకత్వానికి ఒక పరీక్ష లాంటిది. ఈ ఎన్నికల్లో నేను ప్రచారానికి రాకుండా మీ శక్తి సామర్థ్యాలను పరీక్షించాను. నేను ప్రచారానికి రాకుండానే నంద్యాలలో 27వేల మెజార్టీ వచ్చింది. అదే నేను ప్రచారానికి వచ్చుంటే మెజార్టీ 57వేలు అయ్యుండేదన్నాడు. ఆ సమయంలో సోమిరెడ్డి మనసులో ఏ పార్టీకి 57వేలు వచ్చుండేది అని అనుకున్నాడు. తర్వాత చంద్రబాబు మాట్లాడుతూ... మనం చేసిన అభివృద్ధికి లెక్కలు కడితే నంద్యాలలో మెజార్టీ 50వేలు దాటుండాలి. అయినా ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రలోభాలు పని చేసినట్లున్నాయి. కాబట్టే మెజార్టీ తగ్గింది. అయినా ఇబ్బంది లేదు... వచ్చే ఎన్నికల్లో ఆ మెజార్టీ తగ్గకూడదని చెప్పి కూర్చున్నాడు.

ప్రసంగాలు ముగిసాక అభినందన కార్యక్రమం మొదలైంది. చంద్రబాబే స్వయంగా ఈ కార్యక్రమం నడపడానికి మళ్లీ మైకందుకుని... నంద్యాల, కాకినాడలలో మనం అద్భుత విజయాలు సాధించాం. ఈ విజయాల వెనుక ఒక తెలియని అదృశ్య శక్తి వుంది. అదే మనల్ని ముందుకు నడిపింది... అని చెబుతుండగా సోమిరెడ్డితో సహా మిగతా మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఎవరికి వాళ్ళు... ఆ అదృశ్య శక్తులం మేమే అన్నట్లుగా లోలోన మురిసి పోసాగారు. చంద్రబాబు తన స్పీచ్‌ను కొనసాగిస్తూ... ఆ అదృశ్య శక్తిని ఈరోజు సత్కరించుకోవడం మన కర్తవ్యం... ఆ శక్తి ఎవరో కాదు, అని చంద్రబాబు చెప్పబోతుండగానే మంత్రులు ఎవరిపాటికి వాళ్లు సన్మానానికి సై అన్నట్లుగా లేచారు. కాని, ఆ క్షణంలో చంద్రబాబు నోటి నుండి 'నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్' అనే పేరు వచ్చింది. ఆ పేరు వినగానే హాల్ అంతా నిశ్శబ్దం... నిల్చున్న మంత్రులైతే నోర్లు తెరచి అలానే విగ్రహాల్లా ఉండిపోయారు. వాళ్లంతా తేరుకోడానికి పది నిముషాలు పట్టింది. ఈలోపు హాల్‌లో ఓ మూలన కూర్చుని వున్న అబ్దుల్ అజీజ్ వెళ్ళి వేదికనెక్కాడు. చంద్రబాబు, లోకేష్‌లు అజీజ్‌ను సత్కరించడానికి శాలువా కప్ప బోతుండగా మంత్రి ఆదినారాయణరెడ్డి ఆవేశంగా... ఈ ఎన్నికల్లో ఏం పొడిచాడని ఆయనను సన్మానిస్తున్నారు. రేయింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకున్న మేమంతా పనికిమాలిన వాళ్లమా? ఇదేనా మీ న్యాయం? ఇదేనా మీ ధర్మం అని ప్రశ్నించాడు. అప్పుడు చంద్రబాబు కూడా ఆవేశంగా... ఆపండి ఆదినారాయణరెడ్డి... అంతకు మించి ఒక్క మాట మాట్లాడినా బాగుండదు. నంద్యాల, కాకినాడలలో మీ వల్ల గెలిచారనుకుంటున్నారా? కేవలం అజీజ్ వల్లే గెలిచాం అని అన్నాడు. అదెలా అని అఖిలప్రియ ప్రశ్నించింది. ఇలా అంటూ చంద్రబాబు గాల్లో వేళ్లతో స్క్రీన్ గీసి ఫ్లాష్‌బ్యాక్ ప్లే చేసాడు.

★★★★★

చంద్రబాబు తన ఛాంబర్‌లో కూర్చుని వున్నాడు. అప్పుడే ఏబిసిడి ఛానల్ అధిపతి గోకులకృష్ణ వచ్చాడు. నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో పరిస్థితి ఎలా వుందని చంద్రబాబు అడిగాడు. అందుకు గోకులకృష్ణ... జగన్‌కే జనం బ్రహ్మాండంగా వస్తున్నారని అన్నాడు. దానికి చంద్రబాబు... ఓట్ల కోసం మేం చేయాల్సిందంతా చేస్తున్నాం. పొలాలిస్తున్నాం, స్థలాలిస్తున్నాం, ప్రభుత్వ ఆస్తులు కూడా రాసిస్తున్నాం, కార్లు, ట్రాక్టర్లు, బైక్‌లు, సెల్‌ఫోన్‌లు, క్రికెట్ కిట్లు, గాజులు, ఉంగరాలు, ముక్కుపుడకలు... ఇలా అన్నీ ఇస్తున్నాం. అయినా గెలుపుపై నమ్మకం రావడం లేదు. అని చెప్పాడు. అప్పుడు గోకులకృష్ణ... జనాలకు ఇవన్నీ పంచితే ఓట్లేయరు... వారిలో భయం తేవాలి అని సలహా ఇచ్చాడు. భయం ఎలా తేవాలని చంద్రబాబు అడిగాడు. ఏం లేదు... ఈ ఎన్నికల్లో గెలిస్తే నంద్యాలను, కాకినాడను స్మార్ట్ సిటీలను చేస్తామని చెప్పండి. ఓడిపోతే నెల్లూరులాగా చేస్తామని ఈ విజువల్స్ చూపించి చెప్పండి అంటూ తన సెల్‌ఫోన్‌లో వున్న నెల్లూరు నగరం విజువల్స్ చూపించాడు. నెల్లూరులో ఐఆర్ 20-420 ముదురుదోమలు, అవి కరిచి ఆసుపత్రులపాలైన రోగులు, భూగర్భ డ్రైనేజీ కోసం అడ్డంగా తవ్వేసిన రోడ్ల మధ్యలో పడి కాళ్లు విరగ్గొట్టుకుంటున్న జనం... దారినపోయే మనుషులపై దాడులు చేస్తున్న పందులు... ఈ విజువల్స్ చూడగానే చంద్రబాబుకు ఎక్కడలేని హుషారొచ్చింది. ఇక చూడు ఆటాడిస్తా అంటూ లేచాడు....

ఇక్కడ ఎయిర్ స్క్రీన్ మీద సీన్‌లు ఆగిపోయాయి. బాబు మళ్లీ మాట్లాడ్డం మొదలుపెట్టి... గోకుల కృష్ణ ఇచ్చిన నెల్లూరు సిటీ విజువల్స్‌ను నంద్యాల, కాకినాడలలో విస్తృతంగా ప్రచారం చేయించాను. ఆ రెండు చోట్లా తెలుగుదేశం ఓడిపోతే మీ పట్టణాలను నెల్లూరు లాగా మార్చిస్తానని ప్రచారం చేయించాను. అందుకే జనం భయపడి తెలుగుదేశాన్ని గెలిపించారు. ఈ ఘనత నెల్లూరు కార్పొరేషన్‌దే! అందుకే ఆ సంస్థ తరఫున మేయర్ అజీజ్‌ను సన్మానిస్తున్నాను. ఇది తప్పా? ఇది నేరమా? ఇది అన్యాయమా? అని చంద్రబాబు ప్రశ్నించాడు. మంత్రులు పశ్చాత్తాప హృదయాలతో ఒక్కసారిగా నో... నో... నో అని అరిచారు.

## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. పెట్టుబడులకు వ్యాపార విస్తరణకు అనుకూల సమయం కాదు. ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. వివాహాది ప్రయత్నాలలో జాప్యం జరుగుతుంది. ఆర్థికపరమైన వత్తిడి ఇబ్బందులుండవచ్చును. ఖర్చులు ఏదో ఒక నెపంతో పెరుగుతాయి. సరైన నిర్ణయాలు తీసికొనలేని స్థితి ఉంటుంది.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆస్థి, కుటుంబ వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. ఆరోగ్యం ఫరవాలేదు. దూరప్రయాణాలుంటాయి. కొత్త వస్తువులు సమకూరడం, ఇతరులకు సహాయ పడటం చేస్తారు. అధికారవర్గ సహాయ సహకారాలు పొందుతారు. కోర్టు కేసులు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి పురోగతి ఉంటుంది. ఆదాయం బాగుంటుంది.

## మిథునం

మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

నూతన పరిచయాలు కలిగి మేలు జరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. ఆహ్వానాలు అందుకొంటారు. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగులు అధికారులతో సన్నిహితము కాగలరు. అవసరాలు, అనుకున్న పనులు నెరవేరుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. స్వల్పంగా అదనపు ఖర్చులుండినా ఇబ్బంది కలుగదు.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగావకాశాలు లభించగలవు. శుభకార్యలలో పాల్గొంటారు. రావలసిన బాకీలు కొంత లభించడం, గతంలోని ఆర్థిక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. అనుకోని ఖర్చు ఒకటి పైన పడుతుంది. అనుకున్న పనులు సవ్యంగా జరగడం వల్ల సంతృప్తి ఉంటుంది. కుటుంబంలో అభిప్రాయ భేదాలుండి సర్దుబాటు కాగలవు. మొగమాటాలకు లోబడవద్దు.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. కొత్త నిర్మాణాలు చేపట్టుతారు. శుభకార్యాలలో పాల్గొంటారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఇతరుల వల్ల విమర్శలు అభియోగాలు ఎదుర్కొనవలసి ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా నుండి ఆదాయం బాగుంటుంది. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బంధువుల వల్ల ఇబ్బందులేర్పడవచ్చును. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. దూరప్రయాణాలు, శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. మంచి పనులకు సహాయమందిస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. ఉద్యోగులు తమ పనులందు జాగ్రత్త పడటం మంచిది. అనుకోని ఖర్చుల భారం పైనబడుతుంది. అయినా ఇబ్బందులు అధిగమిస్తారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 8.9.2017 నుండి
తేది. 14.9.2017 వరకు

ఈ వారం కర్కాటకంలో రాహుశుక్రులు, సింహంలో రవికుజబుధులు, కన్యలో గురువు, 12తేది నుండి తులలో గురువు, వృశ్చికంలో శని, మకరంలో కేతువు, మీన మేష వృషభ మిధున రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

తేది 12 మంగళవారం గురువు తలారాశి ప్రవేశము.
కావేరి నదీ పుష్కరాలు.
మహాలయ పక్షము జరుగుచున్నది.

### భాద్రపద మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 8 | శుక్ర | విదియ | ఉ॥ గం.11.02వ॥ |
| తేది. 9 | శని | తదియ | ఉ॥ గం.9.50వ॥ |
| తేది. 10 | ఆది | చతుర్థి | ఉ॥ గం.8.16వ॥ |
| తేది. 11 | సోమ | పంచమి | ఉ॥ గం.6.23వ॥ |
| | పిదప | షష్ఠి | రా॥ గం.4.17వ॥ |
| తేది. 12 | మంగళ | సప్తమి | రా॥ గం. 1.54వ॥ |
| తేది. 13 | బుధ | అష్టమి | రా॥ గం.11.28వ॥ |
| తేది. 14 | గురు | నవమి | రా॥ గం.9.00వ॥ |

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ప్రభుత్వంతో సంబంధించిన పనులు ఆలస్యం కాగలవు. నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతాయి. పిల్లల వల్ల కొద్ది ఇబ్బందులు కలుగవచ్చును. శుభకార్య నిర్ణయాలలో జాప్యం జరుగుతుంది. వృత్తి పరంగా అభివృద్ధి బాగుంటుంది. ముఖ్యవిషయాలలో బంధుమిత్రుల సలహా పొందండి. అనుకోని ప్రయాణముంటుంది. ఆర్థిక విషయాలలో జాగ్రత్త పడండి.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కుటుంబసౌఖ్యం కలదు. శుభకార్యాలలో పాల్గొంటారు. బిడ్డల అభివృద్ధికి కొత్త పథకాలు నిర్ణయించుకొంటారు. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. మీ సూచనలు సలహాల వల్ల సంస్థలలో అభివృద్ధి కలదు. ఆరోగ్యం బాగుంటుంది. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. బంధువర్గంతో సమస్యలు, వివాదాలు వచ్చే అవకాశమున్నది.

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, స్థానమార్పు ప్రయత్నాలు జరుగుతాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. దూర దేశ ప్రయాణాలు నిర్ణయం కాగలవు. కుటుంబమునకు రావలసి బాకీలు లభించడం, కోర్టు కేసులందు అనుకూలత, ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక స్థితి బాగుండి వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు లభిస్తాయి. ఆదాయం పెరుగుతుంది.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

రావలసిన బాకీలు కొంత లభించగలవు. చెల్లింపులు సకాలంలో జరుపుతారు. ఏ రకమైన ప్రలోభాలకు మెత్తబడవద్దు. బంధువుల రాకపోకలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలపై దృష్టి పెడతారు. కొత్త వ్యాపారాలకు పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. మీ పనులు జరగడానికి బంధుమిత్రులు సహాయ పడతారు. శుభకార్యాలు ఫలించే అవకాశం ఉన్నది.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబసౌఖ్యం ఉంటుంది. నూతన వస్తువులను సమకూర్చుకొంటారు. అధికారులతో మంచి అనుకూలత ఉంటుంది. నిర్మాణాలు, కాంట్రాక్టులు పొందడం సవ్యంగా సాగుతుంది. విమర్శలు, నిందలు తగ్గించి ఇతరులతో సామరస్యంగా మెలగండి. అనుకున్న పనులు టెన్షన్ పెట్టగలవు. అయితే సమస్యలను పరిష్కరించుకొనగల సామర్థ్యం ఉంటుంది.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగార్థులకు అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగులకు విధి నిర్వహణ సాఫీగా సాగిపోతుంది. బిడ్డల చదువు ఆరోగ్య విషయాలలో శ్రద్ధ పెడతారు. ఇంటికి కొత్త వస్తువులు సమకూరుతాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. మంచి పనులకు, దైవ కార్యాలకు సహాయం చేస్తారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

# కల్యాణ వైభవం...!



స్వామిదాస్ స్కూల్ వ్యవస్థాపకులు స్వర్గీయ బి.స్వామిదాస్ - స్వర్గీయ లిలీ స్వామిదాస్‌ల మనుమడు, రిటైర్డ్ ఆంధ్రాబ్యాంక్ సీనియర్ మేనేజర్ పొట్టిపాడు ప్రసాద్ - గ్రేస్ వనజల కుమారుడు సాహిత్ - రేచల్ (డా॥ పి.ఇమ్మానియల్ విజయ్ ఆనంద్ - ఎలిజబత్‌ల కుమార్తె)ల వివాహం ఈ నెల 4వ తేదీ బెంగుళూరులోని సెయింట్ జాన్స్ చర్చి నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



# కావలి కబుర్లు

## బాలకృష్ణారెడ్డినగర్‌పై వివక్ష ఎందుకు?

### - కాలనీవాసుల ఆవేదన



కావలి పట్టణంలోని 16వ వార్డు పరిధిలో ఉన్న బాలకృష్ణారెడ్డినగర్‌లో నివసించే పేదప్రజలపై కావలి మునిసిపల్ కమిషనర్ వివక్ష చూపుతున్నారంటూ స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలకృష్ణారెడ్డినగర్ ఏర్పడి సుమారు పాతిక సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఈ ప్రాంతంలో కనీస వసతులు సమకూర్చడం లేదని, అసలు ఈ కాలనీ కావలి మునిసిపల్ పరిధిలో ఉందా లేదా అనే సందేహం కలుగుతోందని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ కాలనీలో బడుగు బలహీనవర్గాల ప్రజలు కాయకష్టం చేసుకుని జీవనం సాగిస్తున్నారని, పనులకు వెళ్తే తప్ప పూట గడవదని అంటూ, ఈ పేద కాలనీపై కమిషనర్‌కు వివక్ష తగదని వారు పేర్కొంటున్నారు. "వర్షం వస్తే నీరు పోయేందుకు డ్రైనేజీ కాలువలు లేవు, రోడ్లు పరమ అధ్వాన్నంగా ఉన్నాయి. రాత్రి పూట వీధి దీపాలు వెలగవు. నిత్యం పందులు, కుక్కలతో ఇబ్బందులు, గతంలో డెంగ్యూ, విషజ్వరాలతో నలుగురు చనిపోవడం కూడా జరిగింది. ఇన్ని ఇబ్బందులు పడుతున్నా బాలకృష్ణానగర్ దుస్థితిని పట్టించుకోవడం ఎంతో బాధాకరమని"..స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈ కాలనీ పరిస్థితిని పట్టించుకుని అన్ని ప్రాంతాలతో సమానంగా బాలకృష్ణారెడ్డినగర్‌ను కూడా అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.

## నెల్లూరీయులకు 'ఆటా' అవార్డులు



నెల్లూరు భక్తవత్సలనగర్ కెఎన్‌ఆర్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గుండాల నరేంద్రబాబుకు ఆటా అవార్డు లభించింది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబర్ 5వ తేదీని పురస్కరించుకుని ప్రతియేటా భద్రాచలంలో విభిన్న రంగాల్లో విశేష కృషి చేసినందుకు గాను గుండాల ఈ అవార్డుకు ఎంపికయ్యారు. అక్టోబర్ 8వ తేదీన భద్రాచలంలోని తాళ్ళూరి పంచాక్షరయ్య ఛారిటబుల్ ట్రస్ట్, తానా, తెలంగాణ సాంస్కృతిక శాఖ సమక్షంలో గుండాల ఈ అవార్డును అందుకుంటారు.

### రాచపాళెం దంపతులకు...



రత్నమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత 23 సంవత్సరాలుగా నెల్లూరుజిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సామాజిక సేవలకు గుర్తింపుగా అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) జాతీయ అవార్డు-2017ను ఆటా జాతీయ అవార్డు అధ్యక్షుడు బెక్కంటి శ్రీనివాసరావు ప్రకటించారని రాచపాళెం రఘు తెలియజేశారు. ఈ అవార్డును తాను తన భార్య విజయ కలసి భద్రాచలంలో అక్టోబర్ 8న సంయుక్తంగా అందుకోనున్నట్లు తెలిపారు.

## వృద్ధులకు నిత్యావసర సరుకులు



కావలిలోని వెంగళరావునగర్‌లో వున్న డిఆర్ విశ్వోదయ సేవాసమితిలో 70 మంది వృద్ధులకు సుమారు 60 వేల రూపాయల విలువజేసే నిత్యావసర సరుకులను ఈ నెల 3న పంపిణీ చేశారు. విశ్వోదయ సంస్థ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ డాక్టర్ సి.ఇందిరమ్మ, కావలి మునిసిపల్ కౌన్సిలర్ కనుపర్తి రాజశేఖర్, వైఎస్సార్సీపి జిల్లా కార్యదర్శి, రెడ్‌క్రాస్ వైస్‌ప్రెసిడెంట్ గంధం ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొని వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, డిఆర్ విద్యాసంస్థల అధినేత డి.ఆర్ ఎంతోమందికి విద్యాదానం చేసిన మహనీయులని కొనియాడారు. డిఆర్ పేరుతో మరెన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జవహర్‌భారతి విశ్రాంతి లెక్చరర్ ఎం.శ్రీనివాసులు వృద్ధులకు భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డితో పాటు దొడ్ల లక్ష్మి, దొడ్ల ఆశ్రితరెడ్డి, కూనం తాతిరెడ్డి, శిరీష, అమరావతి, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

### అల్లూరు రామకృష్ణా జూనియర్ కాలేజీ

## ప్రిన్సిపాల్‌గా డా.ఎం. వెంకటరావు



అల్లూరులోని రామకృష్ణా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న మేడా రామకృష్ణారెడ్డి ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన్ను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, మిత్రులు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించి సత్కరించారు. ఆయన స్థానంలో అదే కళాశాలకు చెందిన తెలుగు లెక్చరర్ డా. మర్రి వెంకటరావు ప్రిన్సిపాల్‌గా ఈ నెల 1న పదవీబాధ్యతలు స్వీకరించారు. డా. వెంకటరావు మంచి విద్యావేత్త. 'నెల్లూరుజిల్లా జానపద గేయాలు-ఒక పరిశీలన' అనే అంశంపై పరిశోధన జరిపి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. పదేళ్లపాటు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా కూడా పనిచేసి విద్యార్థుల కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. 2015లో స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి పి.నారాయణ, అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. ఆ సందర్భంగా నాటి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు డా. వెంకటరావును కళాశాలలో ఘనంగా సన్మానించి 10వేల రూపాయల బహుమతిని కూడా అందజేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన రామకృష్ణా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. వెంకటరావు పదవీబాధ్యతలు స్వీకరించినందుకు మిత్రులు, సహచరులందరూ ఆయనకు శుభాభినందనలు తెలియజేశారు.

### పర్యావరణ పరిరక్షణ

## అవగాహన ర్యాలీ



నెల్లూరు పొదలకూరురోడ్డులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణం నుండి జడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ ఈ నెల 7వ తేదీ జిల్లా వాకర్స్ గవర్నర్ బి.మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చెట్లు పెంపకం, నీటి వనరులు రక్షించుకోవడం కొరకు ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకుని వర్షపునీటిని కాపాడుకోవలసిన అవసరముందన్నారు. జడ్పీ వాకర్స్ సంఘం అధ్యక్షులు చెలంచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణం పట్ల ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జగ్గీ వాసుదేవ్ పిలుపు మేరకు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వాకర్స్ కార్యదర్శి జెయస్‌ఆర్ ఆంజనేయులు సారధ్యంలో బ్యానర్లతో ర్యాలీని జడ్పీ కాలనీ, ట్రంకు రోడ్డు నిప్పో సెంటర్ మీదుగా నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ తిరిగి జడ్పీ స్కూలుకు చేరారు. ఈ కార్యక్రమంలో బిరుదవోలు రామిరెడ్డి, మండవ శ్రీనివాసరావు, మెట్టు సుధాకర్‌రెడ్డి, వాసుదేవయ్య, యం.చెంచయ్య, శివశంకరయ్య, శ్రీనివాసులు తదితర సభ్యులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## డా.వైఎస్‌కు ఘననివాళి



దివంగతనేత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ నెల 2న కావలిలోని 25వ వార్డు ఉదయగిరిరోడ్డులో ఉన్న డా.వైఎస్‌ఆర్ విగ్రహానికి ఆ వార్డు కౌన్సిలర్ నెల్లూరు సీతారామమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డా.వైఎస్‌ఆర్ ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, పేదలకు ఇళ్ళు తదితర పథకాలు ప్రజలకు ఎంతో చేరువయ్యాయని, డా.వైఎస్ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరపు విలియం, మందా కోటయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, పెన్మాక సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాగరాజు, కృష్ణారెడ్డి, నరసయ్య, సుందరం, ప్రసన్న మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాకర్స్‌కు వైద్య పరీక్షలు



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. జయచంద్ర ఆసుపత్రి వైద్యుడు శైలేష్ ఎముకల పటుత్వ పరీక్షలు జరిపారు. డాక్టర్ పిఎల్‌రావు ఆసుపత్రి డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పించారు. 300 మందికి బి.పి, షుగర్ పరీక్షలు చేశారు. వాకర్స్ అధ్యక్షులు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణా రమేష్‌బాబు, డిప్యూటి గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, కోశాధికారి పొన్నాల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రావి ఆకుపై రాధాకృష్ణన్





నెల్లూరుజిల్లా కావలి పట్టణంలోని వెంగళరావునగర్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదివే విద్యార్థి సయ్యద్ హాఫీజ్ ఆలీ రావి ఆకుపై తొలి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని గీసి అందరినీ అబ్బుర పరిచాడు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాను ఈ చిత్రాన్ని గీసినట్లు అలీ తెలిపాడు.



# కలంపై పేలిన తూటా

- మహిళా జర్నలిస్ట్ దారుణ హత్య
- దుండగుల కోసం పోలీసుల గాలింపు

బెంగుళూరులోని ప్రముఖ మహిళా జర్నలిస్ట్ గౌరీ లంకేష్ ఈనెల 5వ తేది రాత్రి హత్యకు గురయ్యారు. రాత్రి 8 గంటల సమయంలో ఆమె ఇంటిబయట నిల్చుని ఉండగా ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై ఆమెకు అతి దగ్గరగా వచ్చి కాల్పులు జరపడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయి దుర్మరణం పాలయ్యారు. ఈ హత్యోదంతం బెంగుళూరులో సంచలనం సృష్టించింది. బెంగుళూరు మహానగరంలో ఇలా ఒక మహిళా జర్నలిస్ట్‌ను అత్యంత దారుణంగా హత మార్చడం ఘోరం..దారుణం. జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్న వారిపట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించి, జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బెంగుళూరుకు చెందిన గౌరీలంకేష్ అభ్యుదయవాది. బెంగుళూరులో బిఏ పూర్తిచేసి, ఢిల్లీలోని జెఎన్‌యులో ఆమె మాస్ కమ్యూనికేషన్ పట్టా అందుకున్నారు. ఢిల్లీతో పాటు, ఫ్రాన్స్, అమెరికాల్లోని కొన్ని పత్రికల్లో పనిచేసి ఆ పత్రికలకు తన సేవలందించిన ఘనత ఆమెకుంది. ఆ తర్వాత ఆమె బెంగుళూరుకు వచ్చి, తండ్రి అడుగుజాడల్లోనే లంకేష్ అనే వారపత్రికను నడిపేవారు. తాను నమ్మిన విశ్వాసాలకు అద్దంపట్టేలా ఆ పత్రికను కొనసాగించారు. సండే పత్రికకు, ఈటీవీ తెలుగుకు బెంగుళూరు బ్యూరో ప్రతినిధిగా గతంలో కొంతకాలం సేవలందించిన ఆమెకు ఆంగ్లం, కన్నడ భాషల్లో మంచి భాషాపరిజ్ఞానం ఉంది. మావోయిస్టులకు సానుభూతిపరురాలైన ఆమె.. వారు జనజీవనస్రవంతిలో కలిసేందుకు కృషిచేశారు. మావోయిస్టులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా సేవలందించారు. బెంగుళూరులోని మతసామరస్య వేదిక ప్రతినిధిగా ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. మూఢనమ్మకాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, దేవాలయాల్లో జరిగే మూఢనమ్మకాలను విమర్శిస్తూ అనేక కథనాలు రాసేవారు. విద్యార్థుల కోసం గైడ్ పేరిట మాసపత్రికను కూడా ప్రచురిస్తున్నారు. రాష్ట్ర పత్రికా అకాడమీ, ప్రెస్ క్లబ్, సందేశ్ పాత్రికేయ పురస్కారాలను ఆమె అందుకున్నారు. ఆదివాసీలు, గిరిజనుల హక్కులపై క్రియాశీలకంగా పని చేస్తున్నారు. కాగా, గత ఏడాది నవంబరులో బిజెపి నేతలు వేసిన పరువునష్టం కేసులో ఆమెకి ఆరునెలల జైలుశిక్ష పడింది. అయితే బెయిల్‌పై ఆమె బయటే ఉన్నారు. అభ్యుదయవాదిగా పేరొందిన ఆమె హత్యకు గురికావడం పట్ల దేశవ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖులు, రాజకీయవేత్తలు తమ విచారం ప్రకటించి ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు. పాత్రికేయసంఘాలు, అనేకమంది సాహితీవేత్తలు ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తూ, దుండగులను వెంటనే పట్టుకుని శిక్షించాలని కోరుతున్నారు.

## గౌరీలంకేష్ మృతి కలచివేసింది - సిఎం సిద్ధరామయ్య

ప్రముఖ జర్నలిస్ట్ గౌరీలంకేష్ మృతి తనను కలచివేసిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. రెండేళ్ళ క్రితం సాహితీవేత్త ఎం.ఎం కలబురగి హత్యోదంతం నుంచి తేరుకునేలోగానే గౌరీలంకేష్‌ను దుండుగులు హత్యచేశారని విచారం వెలిబుచ్చారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు పోలీసుబృందాలు రంగంలోకి దిగాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా మాజీప్రధాని దేవెగౌడ, మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్, కేంద్రమంత్రి సదానందగౌడ, బిజెపి కర్నాటక అధ్యక్షుడు యడ్యూరప్ప, ప్రముఖ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్, కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, పలువురు ఆర్ఎస్ఎస్ నేతలు.. తదితర ముఖ్యులెందరో గౌరీలంకేష్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ తమ సంతాపం తెలియజేశారు. ప్రత్యేకించి రాహుల్‌గాంధీ ఒక ప్రకటనలో 'నిజం ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండదు. మన హృదయాల్లో ఆమె సుస్థిర స్థానం సంపాదించారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం సానుభూతిని తెలియజేస్తున్నా'నని పేర్కొంటూ ఆమె మృతికి విచారం ప్రకటించారు. "ఇదొక అత్యంత కిరాతక చర్య. బెంగుళూరులో శాంతి భద్రతల పరిస్థితికి ఈ హత్యోదంతం అద్దం పడుతోంది. దుండగులు, నేరస్థులకు ఈ నగరం నెలవుగా మారిందంటూ".. ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. ఇంకా పలు పాత్రికేయ సంఘాలు, పలువురు సాహితీవేత్తలు ఆమె హత్యను ఖండించాయి. మహిళా జర్నలిస్ట్ గౌరీ లంకేష్‌ను హత్యచేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి, వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పాత్రికేయసంఘాలు విజ్ఞప్తిచేస్తున్నాయి.

### 21 నుండి యర్రకట్ట

## శ్రీ మహాలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు

నెల్లూరు టెక్కేమిట్ట యర్రకట్టలో వేంచేసియున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 21 నుండి 30వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21న కలశస్థాపన, చండీ అలంకారం, 22న భవానీ అలంకారం, 23న గాయత్రిదేవి అలంకారం, 24న అన్నపూర్ణాదేవి అలంకారం, 25న గజలక్ష్మి అలంకారం, 26న కాళికాదేవి అలంకారం, 27న సరస్వతిదేవి అలంకారం, 28న (దుర్గాష్టమి) దుర్గాదేవి అలంకారం, 29న మహిషాసురమర్ధిని అలంకారం, 30న శ్రీ రాజరాజేశ్వరి అలంకారం, రాత్రి 7గంటలకు శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వార్ల శాంతి కళ్యాణం జరుగుతుందన్నారు. అదేరోజు రాత్రి 9గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 1వ తేదీ శ్రీ మహాలక్ష్మిదేవి అలంకారం, రాత్రి 7గంటలకు అమ్మవారి ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 6వ తేదీ శుక్రవారం శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల ముగింపు సందర్భంగా 16రోజుల పండుగ జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

## బెట్టింగ్ నిందితుల బెయిల్ పిటిషన్ కొట్టివేత

క్రికెట్ బెట్టింగ్ కేసులో అరెస్టయిన కృష్ణసింగ్‌తో పాటు, మరో పదిమంది బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా, మొదటి అదనపు జిల్లాకోర్టు న్యాయమూర్తి శ్యామలాదేవి బుధవారం ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. ఆగస్టు 3వతేదీన జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు జిల్లావ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్‌లపై దృష్టి సారించి, బెట్టింగ్‌లకు సంబంధించిన బుకీలు, పంటర్‌లను మొత్తంగా 115 మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కొందరు బెయిల్ తీసుకోగా, మరికొందరు నెలరోజుల నుంచి జిల్లాజైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో గత శుక్రవారం కృష్ణసింగ్‌తో సహా మరో 10 మంది బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి పరిశీలించి వీరి పిటిషన్ కొట్టివేశారు. అదేవిధంగా, క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన కేసులో కృష్ణసింగ్, రమేష్‌కుమార్‌లను విచారించేందుకు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ నెల్లూరు నాల్గవ నగర పోలీసులు పెట్టుకున్న పిటిషన్‌ను కూడా న్యాయమూర్తి కొట్టివేశారు. గుర్రం వెంకటేశ్వర్లు, ఎస్.అరుణ్‌కుమార్, మణ్యం ప్రసాద్, దర్శి సుషాంత్‌కుమార్‌లను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతి కోసం కావలి 1వ పట్టణ పోలీసులు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను కూడా న్యాయమూర్తి కొట్టివేశారు.

## ఓటమి నేర్పిన పాఠమేంటి?

(మొదటి పేజీ తరువాయి)

అంటే ఒక కులం అనో, మతం అనో కాదు. ఎన్నికల సమయంలో పార్టీ అధినేతల వ్యవహారశైలి, నాయకత్వ లక్షణాలు, వారి భవిష్యత్ కార్యాచరణను పరిశీలించి ఎవరికి ఓటు వేయాలని నిర్ణయం తీసుకునే తటస్థులని. రాష్ట్రంలో ఇలాంటి వారి శాతం తక్కువే కావచ్చు. కాని ఎన్నికలలో గెలుపోటములను నిర్దేశించే ఓట్లు ఇవేనని గుర్తుంచుకోవాలి. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడానికి ఈ ఓట్లే కీలకమయ్యాయి. ఆ ఎన్నికల్లో తటస్థులు చంద్రబాబు వైపే మొగ్గు చూపారు. రాష్ట్రం విడిపోయి, అప్పుల ఊబిలో వుంది, ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి కూడా లేదు. ఈ స్థితిలో చంద్రబాబు అయితేనే ఈ రాష్ట్రాన్ని గట్టెక్కించగలడని, ఆయనకు ఆ అనుభవం ఉందని, జగన్‌కు అంతటి పరిపాలనానుభవం లేదని చెప్పి తెలుగుదేశంకు ఓట్లేసారు. ఇలా ఓట్లేసిన వాళ్ళలో చంద్రబాబును అప్పటిదాకా ద్వేషించిన ఉద్యోగులు కూడా ఉండడం గమనార్హం. ఈ వర్గం వాళ్ళు మొగ్గుచూపబట్టే కేవలం 5లక్షల ఓట్ల తేడాతో అధికారం చంద్రబాబు చేతుల్లోకి వెళ్లిపోయింది.

నిన్న నంద్యాల, కాకినాడలలో వైకాపాకు తక్కువ ఓట్లేమీ రాలేదు. చంద్రబాబు అంతగా ప్రలోభాలు పెట్టినా వైకాపాకు 70వేల ఓట్లు వచ్చాయి. నంద్యాల ఫలితం వెల్లడయ్యాక కాకినాడ ఎన్నికలు పెట్టినా, తెలుగుదేశంకు వైకాపాకు మధ్య వచ్చిన ఓట్ల తేడా 20వేలు మాత్రమే. వైకాపాకైనా, తెలుగుదేశంకైనా పార్టీ ఓట్లు నికరంగా వుంటాయి. జగన్ ఏం మాట్లాడినా, చంద్రబాబు ఎలా వున్నా ఆ ఓట్లు పక్కకు పోవు. ప్రతి వందఓట్లల్లో 40ఓట్లు తెలుగుదేశంకు, 40ఓట్లు వైకాపాకు, ఓ 10 ఓట్లు మిగతా పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు వున్నాయనుకుందాం. మిగిలిన పదిమంది ఎన్నికల సమయంలోనే నిర్ణయం తీసుకుంటారు. నాయకులనుబట్టి, నాయకులు ఇచ్చే వాగ్దానాలను బట్టి, నాయకత్వ సమర్థతను బట్టి ఎవరికి ఓటే యాలన్నది ఇలాంటి వాళ్లు నిర్ణయించుకుంటారు. డబ్బులతో కొనే ఓట్లనేవి ఇరు పార్టీలకు వుంటాయి కాబట్టి ఆ ఓట్లను తటస్థులతో కలపలేం. విజ్ఞులు, మేధావులు, అభ్యర్థిని, పార్టీ రాష్ట్ర నాయకులను, వారి వ్యవహార శైలిని బట్టి తటస్థులు మారుతుంటారు. ఎన్నికల్లో గెలుపుకు వీరి ఓట్లు చాలా కీలకం. కాబట్టి వారి మనసులకు దగ్గరయ్యేలా జగన్ ఇప్పటి నుండే భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాల్సివుంది.

## ఆ బాబుకు ఏజెంటనే?

(మొదటి పేజీ తరువాయి)

హరిబాబు చేసిందేమీ లేదు. తెలుగుదేశం బాగుంటే చాలనుకున్నాడుగాని, తనను ఈ స్థాయిలో నిలబెట్టిన తన పార్టీ బాగుపడాలనుకోలేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వుండి కూడా పార్టీ అభివృద్ధి గురించి ఆలోచించలేదు. ఆయన కంటే కూడా విష్ణుకుమార్‌రాజు, సోము వీర్రాజు వంటి నాయకులే ఎంతో నయం. తెలుగుదేశం ప్రజావ్యతిరేక విధానాలపై వాళ్ళు గళం విప్పారు. మిత్రపక్షం కాబట్టి అధికారపక్షం ఏ తప్పులు చేసినా మేం తాళం వేయాలనుకోలేదు. తమకు చేతనైనంతలో సభలోనూ, బయట ప్రభుత్వాన్ని నిలదీసారు. ప్రజల పక్షాన నిలిచే ప్రయత్నం చేశారు. కాని, హరిబాబు పార్టీ పరంగా ఎటువంటి ప్రయత్నం చేయలేదు. పార్టీ వాయిస్ వినిపించలేదు. కేవలం తెలుగుదేశం ఏజెంట్‌గానే మిగిలిపోయాడు. ఈయనకు మంత్రి పదవి ఇచ్చినా అది తెలుగుదేశంకు ఇచ్చినట్లే అవుతుందన్న భావనతోనే చివరి నిముషంలో ఆయనకు మొండి చేయి చూపినట్లుగా తెలుస్తోంది.

## ఈ పవనాలెటువైపు?

(మొదటి పేజీ తరువాయి)

పొరపాటున జనసేన కొన్ని సీట్లు గెలిచినా ఎలాగూ తెలుగుదేశంకే సపోర్ట్ చేస్తుంది కాబట్టి అధికారం గ్యారంటీ. ఇదే చంద్రబాబు స్కెచ్. దీనికి తగ్గట్లుగానే పవన్ కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం పక్కా అంటూ చెప్పుకొచ్చాడు.

అయితే నంద్యాల, కాకినాడ ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం వర్గాలను సందిగ్ధంలో పడేసాయి. ఏ కాపు సామాజిక వర్గం వాళ్లయితే తెలుగుదేశానికి దూరమయ్యారని, ఆ ఓట్లు వైకాపాకు పోకుండా చూడాలంటే వచ్చే ఎన్నికల్లో జనసేనను పోటీ పెట్టించి డైవర్ట్ చేయాలనుకుంటున్నారో ఆ కాపులు ఈ రెండుచోట్లా తెలుగుదేశంకే అండగా నిలిచారు. వీళ్ల ఓట్లు వైకాపాకు పడుంటే జనసేనపై చంద్రబాబుకు ఒక క్లారిటీ వుండేది. ఖచ్చితంగా ప్రభుత్వ వ్యతిరేక ఓటును వైకాపాకు పోకుండా చూసేందుకు జనసేన చేత సొంతంగా పోటీ చేయించి ఉండేవాడు. ఇప్పుడు ఈ రెండు ఫలితాలతో పునరాలోచనలో పడాల్సి వచ్చింది. జనసేనతో మళ్ళీ జతకడితేనే మేలన్నట్లుగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాపు రిజర్వేషన్ల ఉద్యమం చేస్తున్న ముద్రగడ పద్మనాభం ప్రభావం కాపులపై పెద్దగా లేదని, కాపులు మనల్ని నమ్ముతున్నారని తెలుగుదేశం నాయకులు విశ్వసిస్తున్నారు. పవన్‌ను మళ్లీ కలుపుకుంటే కాపుల ఓటును యధావిధిగా కొల్లగొట్టవచ్చని భావిస్తున్నారు. మరి ఒంటరిగా పోటీ చేస్తానన్న పవన్ అదే మాట మీదుంటాడో లేక మరోసారి చంద్రబాబు చేతిలో వజ్రాయుధంగా మారుతాడో చూడాలి.

## 'ఆనం'దం ఆవిరి

(5వ పేజీ తరువాయి)


నాయకులు కూడా కన్నబాబుకే మద్దతుగా వున్నారు. మొన్న వెంకటగిరిలో పార్టీ సమావేశం జరిగితే కన్నబాబును వేదికనెక్కించడం ఆనంకు మింగుడుపడలేదు. ఆయన అలిగి అక్కడ నుండి వచ్చేసాడని తెలిసింది. కాంగ్రెస్‌లో వున్నప్పుడు ఇలాంటి కన్నబాబులనే కాదు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వంటి రాజకీయ యోధుడిని కూడా మట్టి కరిపించిన చరిత్ర ఆనం సోదరులది. అలాంటి వాళ్ళకు ఇప్పుడు తెలుగుదేశంలో నల్లుల్లాంటి నాయకులు కూడా కంట్లో నలుసుల్లా తయారై వారి నాయకత్వానికే సవాల్ విసురుతున్నాయి.

SPSRNDCCB

# శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
# జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్
## నెల్లూరు.

Regd. No. 2523

(రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య బ్యాంకు)








ఆహ్వానము

## శత వసంతోత్సవ వేడుకలు

తేది : 08.09.2017 శుక్రవారం

సమయం : మ॥ 3.00 గం॥లకు

స్థలము : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయ ప్రాంగణం, గాంధి బొమ్మ సెంటరు, నెల్లూరు.

### ముఖ్యఅతిథులు :

గౌ॥ శ్రీ సి.ఆదినారాయణరెడ్డి గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార, మత్స్య, పశుసంవర్ధక శాఖామాత్యులు

గౌ॥ శ్రీ ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి గారు
ఆం.ప్ర. రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రి బిజినెస్, కామర్స్ మరియు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖామాత్యులు మరియు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రివర్యులు

గౌ॥ శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గారు
ఆం.ప్ర. రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన, పట్టు మరియు అగ్రి ప్రాసెసింగ్ శాఖామాత్యులు

డా॥ శ్రీ పొంగూరు నారాయణ గారు
ఆం.ప్ర. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి మరియు పట్టణ గృహ నిర్మాణ శాఖామాత్యులు

గౌ॥ శ్రీ నారా లోకేష్ గారు
ఆం.ప్ర. రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు ఐ.టి. శాఖామాత్యులు

గౌ॥ శ్రీ పత్తిపాటి పుల్లారావు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు

### విశిష్ట అతిథులు :

గౌ॥ శ్రీ పిన్నమనేని వెంకటేశ్వరరావు గారు
ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ లి.

గౌ॥ శ్రీ కె.రవీందర్‌రావు గారు
ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్ లి.

### గౌరవఅతిథులు :

గౌ॥ శ్రీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి గారు, ఛైర్మన్, జిల్లా పరిషత్, నెల్లూరు.
గౌ॥ శ్రీ షేక్ అబ్దుల్ అజీజ్ గారు, మేయర్, నగర కార్పొరేషన్, నెల్లూరు.
గౌ॥ శ్రీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి గారు, పార్లమెంటు సభ్యులు, నెల్లూరు.
గౌ॥ శ్రీ వెలగపల్లి వరప్రసాదరావు గారు, పార్లమెంటుసభ్యులు, తిరుపతి.
గౌ॥ శ్రీ బీద రవిచంద్ర గారు, ఆం.ప్ర. రాష్ట్ర శాసనమండలి సభ్యులు.
గౌ॥ శ్రీ వాకాటి నారాయణరెడ్డి గారు, ఆం.ప్ర. రాష్ట్ర శాసనమండలి సభ్యులు.
గౌ॥ శ్రీ వి.బాలసుబ్రహ్మణ్యం గారు, ఆం.ప్ర. రాష్ట్ర శాసనమండలి సభ్యులు.
గౌ॥ శ్రీ వై.శ్రీనివాసులురెడ్డి గారు, ఆం.ప్ర. రాష్ట్ర శాసనమండలి సభ్యులు.
గౌ॥ శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గారు, ఆం.ప్ర. రాష్ట్ర శాసనమండలి సభ్యులు.
గౌ॥ శ్రీ పి.అనిల్‌కుమార్‌యాదవ్ గారు, శాసనసభ్యులు, నెల్లూరు నగరం.
గౌ॥ శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గారు, శాసనసభ్యులు, నెల్లూరు గ్రామీణం.
గౌ॥ శ్రీ కురుగొండ్ల రామకృష్ణ గారు, శాసనసభ్యులు, వెంకటగిరి.
గౌ॥ శ్రీ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గారు, శాసనసభ్యులు, కోవూరు.
గౌ॥ శ్రీ కాకాణి గోవర్ధన్‌రెడ్డి గారు, శాసనసభ్యులు, సర్వేపల్లి.
గౌ॥ శ్రీ పాశం సునీల్‌కుమార్ గారు, శాసనసభ్యులు, గూడూరు.
గౌ॥ శ్రీ కిలివేటి సంజీవయ్య గారు, శాసనసభ్యులు, సూళ్ళూరుపేట.
గౌ॥ శ్రీ మేకపాటి గౌతమ్‌రెడ్డి గారు, శాసనసభ్యులు, ఆత్మకూరు.
గౌ॥ శ్రీ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గారు, శాసనసభ్యులు, కావలి.
గౌ॥ శ్రీ బొల్లినేని రామారావు గారు, శాసనసభ్యులు, ఉదయగిరి.
గౌ॥ శ్రీ పి.కృష్ణయ్య గారు, ఛైర్మన్, ఏపిఐసిసి.
గౌ॥ శ్రీ వీరపరెడ్డి జయరామిరెడ్డి గారు, ఛైర్మన్, ఏపి టూరిజం.
గౌ॥ శ్రీ బీద మస్తాన్‌రావు గారు, రాజధాని కమిటి సభ్యులు, అమరావతి.
గౌ॥ శ్రీ కొండూరు పాలుశెట్టి గారు, ఛైర్మన్, ఆం.ప్ర. మత్స్య సహకార సంఘాల సమాఖ్య.
గౌ॥ శ్రీ వై.సుమంత్‌రెడ్డి గారు, అధ్యక్షులు, జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటి, నెల్లూరు.
గౌ॥ శ్రీ కొండ్రెడ్డి రంగారెడ్డి గారు, అధ్యక్షులు, విజయ పాలడెయిరీ, నెల్లూరు.
గౌ॥ శ్రీ టి.రమణయ్యనాయుడు గారు, డైరెక్టర్, మార్క్‌ఫెడ్
గౌ॥ శ్రీ కిలారి వెంకటస్వామి నాయుడు గారు, ఛైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ.
గౌ॥ శ్రీ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గారు, ఛైర్మన్, నుడా.
గౌ॥ శ్రీ వేనాటి రామచంద్రారెడ్డి గారు, జిల్లా పరిషత్ ఫ్లోర్‌లీడర్.

### ఆత్మీయఅతిథులు :

గౌ॥ శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారు, మాజీ ఆం.ప్ర. రాష్ట్ర ఆర్థికశాఖామాత్యులు.
గౌ॥ శ్రీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గారు, మాజీ ఆం.ప్ర. రాష్ట్ర మంత్రివర్యులు.
గౌ॥ శ్రీ బల్లి దుర్గాప్రసాద్ గారు, మాజీ మంత్రివర్యులు.
గౌ॥ శ్రీ పరసా వెంకటరత్నయ్య గారు, మాజీ మంత్రివర్యులు.
గౌ॥ శ్రీ తాళ్ళపాక రమేష్‌రెడ్డి గారు, మాజీ మంత్రివర్యులు.
గౌ॥ శ్రీ ఆనం వివేకానందరెడ్డి గారు, మాజీ శాసనసభ్యులు.
గౌ॥ శ్రీ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి గారు, మాజీ శాసనసభ్యులు.
గౌ॥ శ్రీ నెలవల సుబ్రహ్మణ్యం గారు, మాజీ శాసనసభ్యులు.
గౌ॥ శ్రీ కంభం విజయరామిరెడ్డి గారు, మాజీ శాసనభ్యులు.
గౌ॥ శ్రీ వి.వి.ఆర్.కె. సాయికృష్ణ యాచేంద్ర గారు, మాజీ శాసనభ్యులు.
గౌ॥ శ్రీ కంచర్ల శ్రీహరినాయుడు గారు, మాజీ శాసనభ్యులు.
గౌ॥ శ్రీ ఆనం భక్తవత్సలరెడ్డి గారు, మాజీఛైర్మెన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు.
గౌ॥ శ్రీ వేమారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి గారు, మాజీఛైర్మెన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు.
గౌ॥ శ్రీ తాళ్ళపాక అనూరాధ గారు, మాజీఛైర్మెన్, నెల్లూరు పురపాలక సంఘం.
గౌ॥ శ్రీ చెన్ను బాలకృష్ణారెడ్డి గారు, మాజీ రాపూరు మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్.

### ప్రత్యేక ఆహ్వానితులు :

గౌ॥ శ్రీ ఆర్.ముత్యాలరాజు, ఐ.ఏ.ఎస్., గారు
కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

గౌ॥ శ్రీ బి.రాజశేఖర్, ఐ.ఏ.ఎస్., గారు
ప్రిన్సిపల్ సెక్రటరి, అగ్రికల్చర్ & కో-ఆపరేటివ్.

గౌ॥ శ్రీ జె.మురళి, ఐ.ఏ.ఎస్., గారు
స్పెషల్ కమిషనర్ / రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్

గౌ॥ శ్రీ పి.హెచ్.డి. రామకృష్ణ, ఐ.పి.ఎస్., గారు
సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

గౌ॥ శ్రీ కె.తులసీప్రసాద్ గారు
మేనేజింగ్ డైరెక్టర్, ఏపిసిఓబి

గౌ॥ శ్రీ నేతి మురళీధర్ గారు
మేనేజింగ్ డైరెక్టర్, టిఎస్‌సిఓబి

గౌ॥ శ్రీమతి బి.సుధాభారతి గారు
జిల్లా సహకార శాఖాధికారి

గౌ॥ శ్రీ బి.రమేష్‌బాబు గారు
డి.డి.ఎం. నాబార్డ్



ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము.



శ్రీ మెట్టుకూరు ధనుంజయరెడ్డి
అధ్యక్షులు

ఆహ్వాన కమిటి మరియు పాలకమండలి సభ్యులు

శ్రీ నల్లపురెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి
ఉపాధ్యక్షులు

శ్రీమతి వై.సరిత, ముఖ్య కార్యనిర్వహణాధికారి (ఇన్‌ఛార్జి)

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com